# మన విశ్వం

VOICE OF THE PEOPLE-POWER OF TRUTH

తెలుగు వార్తా దినపత్రిక

MANA VISHWAM TELUGU DAILY

manavishwam.com

వరంగల్ | సంపుటి : 01 | సంచిక : 96 | మంగళవారం 22 సెప్టెంబరు 2026 | పేజీలు : 8 | వెల : రూ.5 | PRGI, NO : TGTEL/26/A4450 | ఎడిటర్ : నమిండ్ల ప్రమోద్




వివరాలు 2లో..

## పౌరసత్వానికి ముందే ఓటు?.. సోనియా కేసులో కొత్త మలుపు!

1980 ఓటరు జాబితాలో పేరు ఉందన్న ఆరోపణపై మళ్లీ విచారణ

1983లో భారత పౌరసత్వం పొందిన సోనియా గాంధీ

ఫిర్యాదును తిరస్కరించిన మేజిస్ట్రేట్ ఉత్తర్వు రద్దు

తాజాగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని ఢిల్లీ ప్రత్యేక కోర్టు ఆదేశం

సెప్టెంబర్ 29న తదుపరి విచారణ



# ఉద్యమకారుల వైపు.. రేవంత్ చూపు!

ప్రత్యేక రాష్ట్ర పోరాటంలో పాల్గొన్న వారి గుర్తింపుపై సర్కారు కసరత్తు

కేశవరావు నేతృత్వంలోని కమిటీ విస్తృత సంప్రదింపులు.. వివిధ వర్గాల అభిప్రాయాల సేకరణ

ఉద్యమకారుల సేవలు, త్యాగాలకు అధికారిక గుర్తింపు దిశగా అడుగులు

తాజాగా కేదారి కుటుంబానికి రూ.10 లక్షలు.. మండల రాజు కుటుంబానికి రూ.5 లక్షల చేయూత

**తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 21 (మన విశ్వం):** తెలంగాణ సాధన కోసం పోరాడిన ఉద్యమకారుల గుర్తింపుపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో భాగస్వాములైన వారి సేవలు, త్యాగాలకు అధికారిక గుర్తింపు ఇచ్చే ప్రక్రియ ముందుకు సాగుతుండగా.. తాజాగా ఉద్యమంతో ముడిపడిన రెండు కుటుంబాలకు ముఖ్యమంత్రి ఆర్థిక చేయూత ప్రకటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఉద్యమకారులను

మిగతా 2లో..



# ఓటరు లెక్కలు.. త్వరగా తేల్చండి!

ఎస్ఐఆర్-2026పై అధికారులకు సీఈవో సుదర్శన్‌రెడ్డి ఆదేశాలు

ఫారం-6, 7, 8 పెండింగ్ దరఖాస్తులపై స్పీడ్

'నో మ్యాపింగ్' కేసులు, లోపాలను గడువులోగా పరిష్కరించాలి

వృద్ధులు, దివ్యాంగులను అనవసరంగా హియరింగ్‌కు పిలవొద్దు


బీఎల్ఏలు నోటీసులు ఇవ్వొద్దు.. ఇళ్ల గుర్తింపులో సహకారానికే పరిమితం

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (మన విశ్వం):** తెలంగాణలో ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ-2026 (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికలఅధికారి సి.సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులు, విచారణ కేసులను త్వరగా పరిష్కరించి రోజువారీ లక్ష్యాలను చేరుకోవాలని ఎన్నికల అధికారులకు స్పష్టం చేశారు. బీఆర్‌కేఆర్ భవన్ నుంచి సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్ఐఆర్ పురోగతిని ఆయన సమీక్షించారు. ఓటరు వివరాల్లోని లోపాలు, 'నో మ్యాపింగ్' కేటగిరీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ఫారం-6, 7, 8 దరఖాస్తులతో పాటు హియరింగ్ కేసులను పెండింగ్‌లో ఉంచొద్దని

మిగతా 2లో..

22ఏ భూములపై..

# ఎన్‌హెచ్‌ఆర్సీ జోక్యం!



తెలంగాణ ప్రభుత్వానికి జాతీయ మానవ హక్కుల కమిషన్ నోటీసు

నాలుగు వారాల్లో సమగ్ర నివేదిక ఇవ్వాలని సీఎస్‌కు ఆదేశం

నోటీసులు లేకుండానే ప్రైవేట్ ఆస్తులు నిషేధిత జాబితాలోకి వెళ్లాయంటూ ఫిర్యాదు

అమ్మకాలు, తనఖాలు నిలిచిపోయి నష్టపోతున్నారన్న బాధితుల వాదన

హైపవర్ కమిటీ రంగంలో ఉన్న వేళే వ్యవహారంలో మరో కీలక మలుపు

**తెలంగాణ బ్యూరో, సెప్టెంబర్ 21 (మన విశ్వం):** తెలంగాణలో రాజకీయంగా, పరిపాలనపరంగా తీవ్ర చర్చకు దారితీసిన 22ఏ భూముల వ్యవహారం ఇప్పుడు జాతీయ మానవ హక్కుల కమిషన్ ముందుకు చేరింది. ప్రైవేట్ పట్టా భూములు, ఇళ్ల స్థలాలు నిషేధిత జాబితాలో చేరడంతో ఆస్తి యజమానుల హక్కులకు భంగం కలుగుతోందంటూ అందిన ఫిర్యాదుపై ఎన్‌హెచ్‌ఆర్సీ స్పందించింది. తెలంగాణ ప్రభుత్వానికి నోటీసు

మిగతా 2లో..


# 248 టీఎంసీలు వచ్చాయ్.. 28 టీఎంసీలే వాడారా?

- కృష్ణా జలాల లెక్కతో సర్కారును నిలదీసిన కేటీఆర్
- 100 టీఎంసీలకు పైగా దిగువకు వెళ్లాయని ఆరోపణ
- జూరాలలో నీరున్నా పంటలకు ఎందుకు ఇవ్వరని ప్రశ్న
- కర్ణాటక నుంచి 5-10 టీఎంసీలు తెప్పించాలని డిమాండ్
- నీరివ్వకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరిక



**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (మన విశ్వం):** జూరాల సాగునీటి వివాదం కృష్ణా జలాల లెక్కలపై రాజకీయ సమరంగా మారింది. ఈ ఏడాది తెలంగాణకు 248 టీఎంసీల కృష్ణా జలాలు అందుబాటులోకి వచ్చినా రాష్ట్ర ప్రభుత్వం కేవలం 28 టీఎంసీలనే వినియోగించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. 100 టీఎంసీలకు పైగా నీరు దిగువకు వెళ్లిపోయిందని పేర్కొంటూ.. నీరు వచ్చినప్పుడు నిల్వ, వినియోగానికి సరైన ప్రణాళిక ఎందుకు చేయలేదని ప్రభుత్వాన్ని

మిగతా 2లో..



# 30 రోజుల్లో ఆసుపత్రి పనులు పూర్తి చేయాలి!

వరంగల్ సూపర్ స్పెషాలిటీపై సీఎం రేవంత్‌రెడ్డి డెడ్‌లైన్

గ్రీన్ ఛానల్‌లో నిధులిస్తున్నా జాప్యమేంటని అధికారులపై ఆగ్రహం

నెల రోజుల పాటు 24 గంటలూ పనులు కొనసాగించాలని ఆదేశం

రోజూ పర్యవేక్షించాలంటూ కలెక్టర్‌కు బాధ్యత

సనత్‌నగర్ టిమ్స్ తరహాలో ఓపీ సేవలకు సిద్ధం చేయాలని సూచన

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (మన విశ్వం):** వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనుల జాప్యంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రీన్ ఛానల్‌లో నిధులు మంజూరు చేస్తున్నప్పటికీ పనులు ఎందుకు ఆలస్యమవుతున్నాయని అధికారులను ప్రశ్నించారు. ఇక జాప్యానికి అవకాశం లేదని స్పష్టం చేస్తూ.. వచ్చే 30 రోజుల పాటు 24 గంటలూ పనులు కొనసాగించాలని ఆదేశించారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రితో పాటు ఇతర ఆసుపత్రుల పనులపై ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వరంగల్ ఆసుపత్రి నిర్మాణం పూర్తికి స్పష్టమైన షెడ్యూల్ రూపొందించి, దాని ప్రకారమే పనులు సాగాలని ఆదేశించారు. ప్రతి పనికి ప్రత్యేక అధికారిని

మిగతా 2లో..

# ఇసుక అక్రమాలకు.. ఇక చెక్!

**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (మన విశ్వం):** రాష్ట్రంలో అక్రమ ఇసుక రవాణా, అక్రమ తవ్వకాలకు అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని ఆదేశించింది. అక్రమాలు జరిగే ప్రాంతాలను గుర్తించి విజిలెన్స్ బృందాలతో నిరంతర తనిఖీలు చేపట్టడంతో పాటు ఆకస్మిక దాడులు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులకు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో గనులు, భూగర్భ వనరుల శాఖ పనితీరుపై సీఎస్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. శాఖ పనితీరు, ఆదాయ సమీకరణ, సిబ్బంది నియామకాలు, పదోన్నతులు, అక్రమ ఖనిజ రవాణా నియంత్రణ తదితర అంశాలను సమీక్షించారు. అక్రమ ఇసుక రవాణాతో పాటు అనుమతులు లేకుండా ఖనిజాల తవ్వకం, తరలింపును అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అక్రమ కార్యకలాపాలు

మిగతా 2లో..



అక్రమ రవాణా, తవ్వకాలపై ఉక్కుపాదం మోపండి: సీఎస్ సంజయ్ జాజు

విజిలెన్స్ బృందాలతో నిరంతర తనిఖీలు.. ఆకస్మిక దాడులకు ఆదేశం

ఫిర్యాదు అందితే తక్షణ చర్య.. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు

ఖనిజ వనరులతో రాష్ట్ర ఆదాయం పెంచాలి.. టెక్నాలజీతో నిఘా బలోపేతం

మైన్స్‌లో ఖాళీల భర్తీ, పదోన్నతుల ప్రక్రియ వేగవంతం చేయాలని స్పష్టీకరణ

# కట్టకపోతే.. ఇందిరమ్మ ఇల్లు కట్!

నిర్మాణం మొదలుపెట్టని మంజూర్ల రద్దుకు సర్కారు నిర్ణయం

రద్దయిన ఇళ్లను ఇతర అర్హులకు కేటాయింపు

ఇప్పటికే నిర్మాణంలో ఉన్నవారికి ఒక్కసారి నిబంధనల సడలింపు

బేస్‌మెంట్ దాటిన అర్హమైన ఇళ్లకు ఒకేసారి క్లియరెన్స్

అదనపు ఆర్థిక భారాన్ని ప్రభుత్వమే భరిస్తుందన్న మంత్రి పొంగులేటి



**హైదరాబాద్, సెప్టెంబర్ 21 (మన విశ్వం):** ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం కీలక హెచ్చరిక ఇచ్చింది. ఇల్లు మంజూరైనా ఇప్పటివరకు నిర్మాణం ప్రారంభించని లబ్ధిదారుల మంజూరును రద్దు చేయాలని నిర్ణయించింది. అలా రద్దయ్యే ఇళ్లను జాబితాలోని ఇతర అర్హులకు కేటాయించనున్నట్లు గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. మరోవైపు ఇప్పటికే

మిగతా 2లో..

మన విశ్వం
VOICE OF THE PEOPLE-POWER OF TRUTH

# ఒత్తిడి పెరుగుతోంది.. ప్రశాంతత దూరమవుతోందా?



సౌకర్యాలు పెరిగాయి.. అవకాశాలు విస్తరించాయి.. సాంకేతికత ప్రపంచాన్ని అరచేతిలోకి తెచ్చింది. కానీ మనిషికి అత్యంత అవసరమైన మానసిక ప్రశాంతత మాత్రం క్రమంగా దూరమవుతోందా? నేటి జీవన విధానాన్ని పరిశీలిస్తే ఈ ప్రశ్నకు ప్రాధాన్యం పెరుగుతోంది. చదువు నుంచి ఉద్యోగం వరకు, ఆర్థిక పరిస్థితుల నుంచి కుటుంబ బాధ్యతల వరకు.. ప్రతి దశలోనూ ఒత్తిడి మనిషిని వెంటాడుతోంది.

విద్యార్థులకు మార్కులు, ర్యాంకులు, పోటీ పరీక్షల ఒత్తిడి. ఉద్యోగులకు లక్ష్యాలు, పనిభారం, ఉద్యోగ భద్రతపై ఆందోళన. కుటుంబాలకు ఆర్థిక అవసరాలు, పెరుగుతున్న ఖర్చులు. వీటికి తోడు సామాజిక మాధ్యమాలు మరో రకమైన ఒత్తిడిని సృష్టిస్తున్నాయి. ఇతరుల జీవితాలతో తమ జీవితాలను పోల్చుకోవడం, కనిపించే విజయాలనే నిజమైన జీవితంగా భావించడం అసంతృప్తికి కారణమవుతోంది. చేతిలోని ఫోన్ ప్రపంచాన్ని దగ్గర చేసినా.. మనుషుల మధ్య మనస్ఫూర్తిగా మాట్లాడుకునే సమయాన్ని మాత్రం తగ్గిస్తోంది.

విజయం కోసం ప్రయత్నించడం తప్పు కాదు. ఉన్నత లక్ష్యాలను పెట్టుకోవడమూ అవసరమే. కానీ వాటి కోసం పరుగెత్తుతూ మనసును కోల్పోతే సాధించిన విజయానికే అర్థం ఉండదు. పని ఎంత ముఖ్యమో విశ్రాంతి కూడా అంతే ముఖ్యం. సంపాదన ఎంత అవసరమో కుటుంబంతో గడిపే సమయం కూడా అంతే విలువైనది. శారీరక ఆరోగ్యాన్ని ఎలా పట్టించుకుంటామో మానసిక ఆరోగ్యాన్నీ అలాగే చూసుకోవాలి.

ఇక్కడ కుటుంబాల పాత్ర అత్యంత కీలకం. సమస్యలను చెప్పుకునే వాతావరణం, ఒకరినొకరు వినే ఓపిక, భావోద్వేగాలకు విలువ ఇచ్చే సంస్కృతి ఇంటి నుంచే మొదలవ్వాలి. పిల్లలపై ర్యాంకుల భారం మోపడం కంటే వారి సామర్థ్యాలను గుర్తించాలి. ఉద్యోగుల విషయంలో సంస్థలు ఫలితాలతో పాటు వారి మానసిక ఆరోగ్యానికీ ప్రాధాన్యం ఇవ్వాలి. పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాల్లో మానసిక ఆరోగ్యంపై అవగాహన, అవసరమైన కౌన్సెలింగ్ అందుబాటులో ఉండాలి.

మానసిక సమస్యలను దాచుకోవాల్సిన బలహీనతగా చూసే దృక్పథం కూడా మారాలి. ఒత్తిడి, ఆందోళన లేదా నిరాశ తీవ్రంగా ఉన్నప్పుడు నిపుణుల సహాయం కోరడం సహజమైన ఆరోగ్య సంరక్షణలో భాగమే. ప్రభుత్వాలు సైతం మానసిక ఆరోగ్య సేవలను పట్టణాలకే పరిమితం చేయకుండా గ్రామీణ ప్రాంతాల వరకు విస్తరించాల్సిన అవసరం ఉంది.

ప్రశాంతత మార్కెట్‌లో కొనుక్కునే వస్తువు కాదు. అది మన జీవన విధానంలో నిర్మించుకోవాల్సిన సమతుల్యత. పని, కుటుంబం, విశ్రాంతి, ఆరోగ్యం మధ్య గీతలు చెరిగిపోకుండా చూసుకోవాలి. ప్రతి విజయానికీ ధరగా మనశ్శాంతిని చెల్లించాల్సిన అవసరం లేదు.

వేగంగా పరుగెడుతున్న ప్రపంచంలో మరింత వేగంగా పరుగెత్తడమే విజయం కాదు. ఎక్కడ వేగం తగ్గించాలో తెలుసుకోవడమూ జీవన విజ్ఞానమే. మానసిక ఆరోగ్యాన్ని విలాసంగా కాకుండా ప్రాథమిక అవసరంగా గుర్తించాలి. వ్యక్తి నుంచి కుటుంబం వరకు, విద్యాసంస్థల నుంచి కార్యాలయాలు, ప్రభుత్వాల వరకు అందరూ దీనికి ప్రాధాన్యం ఇచ్చినప్పుడే ఆరోగ్యకరమైన, ప్రశాంతమైన సమాజం సాధ్యమవుతుంది.

**- నమిండ్ల. ప్రమోద్, ఎడిటర్**

# ఉద్యమకారుల వైపు.. రేవంత్ చూపు!

(మొదటిపేజీ తరువాయి)

గుర్తించి వారి సేవలు, త్యాగాలకు తగిన గుర్తింపు ఇచ్చేందుకు ప్రభుత్వం కే.కేశవరావు నేతృత్వంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రొఫెసర్ కోదండరాం, అద్దంకి దయాకర్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, మోతె శోభన్‌రెడ్డి సభ్యులుగా ఉన్న ఈ కమిటీ వివిధ వర్గాలతో సంప్రదింపులు నిర్వహించి అభిప్రాయాలను సేకరించింది. రాజకీయ పార్టీలు, జేఏసీలు, ఉద్యమ సంఘాలు, విద్యార్థులు, ఉద్యోగులు, కళాకారులు, ప్రజాసంఘాలు సహా ఉద్యమంతో ముడిపడిన వర్గాల నుంచి సూచనలు తీసుకుంది. ఎవరిని ఉద్యమకారులుగా గుర్తించాలి? అందుకు ప్రామాణికాలు ఏముండాలి? వారి సేవలు, త్యాగాలకు ఎలాంటి గుర్తింపు ఇవ్వాలి? అనే అంశాలు ఈ ప్రక్రియలో కీలకంగా మారాయి. ఈ నేపథ్యంలో ఉద్యమంతో ప్రత్యక్ష సంబంధమున్న రెండు కుటుంబాలకు సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి ఆర్థిక చేయూత ప్రకటించారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో సేవలందించిన దివంగత లింగాల కేదారి, ఆయన భార్య పుష్పలత కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.10 లక్షలు అందించాలని అధికారులను ఆదేశించారు. సాధారణ హోటల్ నిర్వహించిన కేదారి దంపతులు ఉద్యమ సమయంలో ఉద్యమకారులకు ఉచితంగా భోజనం, టిఫిన్లు, టీ అందిస్తూ తమవంతు సహకారం అందించారు. ఇటీవల దంపతులు మృతి చెందడంతో వారి కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. మరోవైపు తెలంగాణ ఉద్యమ సమయంలో అదృశ్యమైన జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చెందిన మండల రాజు కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించాలని సీఎం ఆదేశించారు. గొర్లవీడు గ్రామానికి చెందిన మండల సమ్మిరెడ్డి కుమారుడు రాజు 2013 జూన్ 20న అదృశ్యమయ్యారు. ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న రాజు అరెస్టై చర్లపల్లి కేంద్ర కారాగారంలో నిర్బంధంలో ఉన్నారని, అనంతరం అదృశ్యమైనట్లు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వృద్ధ తల్లిదండ్రుల పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని రూ.5 లక్షల సాయానికి సీఎం ఆదేశించారు.

**గుర్తింపు దిశగా అడుగులు**

తెలంగాణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసినవారు, జైళ్లకు వెళ్లినవారు, కేసులు ఎదుర్కొన్నవారు, గాయపడినవారితో పాటు వివిధ రూపాల్లో ఉద్యమానికి అండగా నిలిచిన వారి సేవలను ఎలా గుర్తించాలనే అంశంపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ ప్రక్రియ కొనసాగుతోంది. ఈ తరుణంలో ఉద్యమంతో ముడిపడిన కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక చేయూత ప్రకటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియ పూర్తయితే ఎవరెవరికి అధికారిక గుర్తింపు దక్కుతుంది? గుర్తింపు పొందిన వారికి ప్రభుత్వం ఎలాంటి సహాయ, సంక్షేమ చర్యలు చేపడుతుంది? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# పౌరసత్వానికి ముందే ఓటు?.. సోనియా కేసులో కొత్త మలుపు!

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21 (మన విశ్వం): కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ పేరు భారత పౌరసత్వం పొందకముందే ఓటరు జాబితాలో నమోదైందన్న ఆరోపణల వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ అంశంపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ దాఖలైన ఫిర్యాదును తిరస్కరించిన మేజిస్ట్రేట్ కోర్టు ఉత్తర్వును ఢిల్లీ ప్రత్యేక న్యాయస్థానం రద్దు చేసింది. ఫిర్యాదును తిరిగి విచారించి, సంబంధిత పక్షాల వాదనలు విన్న తర్వాత కారణాలతో కూడిన తాజా ఉత్తర్వు ఇవ్వాలని ఆదేశించింది. వివాదానికి 1980 నాటి ఓటరు జాబితా కేంద్రంగా మారింది. సోనియా గాంధీకి 1983లో భారత పౌరసత్వం లభించగా, అంతకుమూడేళ్ల ముందే ఆమె పేరు ఓటరు జాబితాలో నమోదైందని ఫిర్యాదుదారు ఆరోపించారు. దీనిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేయించాలని కోరుతూ న్యాయవాది వికాస్ త్రిపాఠి కోర్టును ఆశ్రయించారు. అయితే ఇవి ఫిర్యాదుదారు చేసిన ఆరోపణలే తప్ప కోర్టు నిర్ధారించిన అంశాలు కావు. రివిజన్ పిటిషన్‌ను విచారించిన ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగ్నే.. గతంలో మేజిస్ట్రేట్ ఇచ్చిన ఉత్తర్వులో తగిన కారణాలు లేవని పేర్కొన్నారు. చట్టపరమైన ప్రక్రియను పూర్తిస్థాయిలో అనుసరించి ఫిర్యాదును తాజాగా పరిశీలించాలని ఆదేశించారు. కేసు తదుపరి విచారణను సెప్టెంబర్ 29కు నిర్ణయించారు. ఈ వ్యవహారంలో కీలకమైన విషయం ఏమిటంటే.. సోనియా గాంధీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ప్రత్యేక న్యాయస్థానం ఇప్పటివరకు ఆదేశించలేదు. ఎఫ్ఐఆర్ కోరిన ఫిర్యాదును తిరస్కరిస్తూ గతంలో ఇచ్చిన ఉత్తర్వును మాత్రమే రద్దు చేసి, వ్యవహారాన్ని తిరిగి పరిశీలించాలని సూచించింది. తాజా విచారణ అనంతరం మేజిస్ట్రేట్ తీసుకునే నిర్ణయం కీలకం కానుంది.

# 30 రోజుల్లో ఆసుపత్రి పనులు పూర్తి చేయాలి!

(మొదటిపేజీ తరువాయి)

బాధ్యుడిగా నియమించాలని సూచించారు. సీఎంఓ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించాలని సీఎం ఆదేశించారు. వరంగల్ కలెక్టర్ ఇకపై ప్రతిరోజూ ఆసుపత్రి పనుల పురోగతిని పరిశీలించాలని స్పష్టం చేశారు. వైద్యారోగ్య, ఆర్అండ్‌బీ, మున్సిపల్ తదితర శాఖల మధ్య సమన్వయం కోసం అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు.

ఆసుపత్రి పరిసరాలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దడంతో పాటు రోగులకు అవసరమైన సౌకర్యాలపై దృష్టి పెట్టాలని సీఎం చెప్పారు. సనత్‌నగర్ ఎంసీఆర్ టిమ్స్ తరహాలో వరంగల్ ఆసుపత్రిలోనూ ఓపీ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. సనత్‌నగర్ టిమ్స్‌లో స్టాఫ్ క్వార్టర్స్ నిర్మాణ పనులను




వెంటనే ప్రారంభించాలని, ఆసుపత్రి నిర్వహణను ఏజెన్సీకి అప్పగించే అంశంపైనా చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, వైద్యారోగ్య, ఆర్అండ్‌బీ, మున్సిపల్ శాఖల ఉన్నతాధికారులు, వరంగల్, హనుమకొండ కలెక్టర్లు పాల్గొన్నారు.

# కట్టకపోతే.. ఇందిరమ్మ ఇల్లు కట్!

(మొదటిపేజీ తరువాయి)

నిర్మాణం చేపట్టి బేస్‌మెంట్ లేదా ఆపై దశకు చేరుకున్న అర్హమైన ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం ఊరట కల్పించింది. ప్రజాప్రతినిధుల విజ్ఞప్తుల నేపథ్యంలో నిబంధనల్లో ఒక్కసారి ప్రత్యేక సడలింపు ఇవ్వాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. అర్హమైన నిర్మాణాలకు ఒకేసారి క్లియరెన్స్ ఇచ్చి నిధుల విడుదలకు అవకాశం కల్పించనున్నారు. ఈ ప్రత్యేక సడలింపు వల్ల ప్రభుత్వంపై పడే అదనపు ఆర్థిక భారాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. అయితే ఈ వెసులుబాటు ఒక్కసారి మాత్రమే వర్తిస్తుందని, భవిష్యత్తులో మంజూరయ్యే నా3 ఇళ్లకు వర్తించదని పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇల్లు మంజూరైందన్న కారణంతో నిర్మాణాన్ని ప్రారంభించకుండా ఉంటే ఇక మంజూరు కొనసాగదన్న సంకేతాన్ని ప్రభుత్వం ఇచ్చింది. నిర్మాణం మొదలుపెట్టని ఇళ్లను రద్దు చేసి మరో అర్హుడికి అవకాశం ఇవ్వనున్న నిర్ణయంతో పెండింగ్ మంజూర్లపై ఇప్పుడు దృష్టి పడనుంది.

మంజూరైంది.. కట్టకపోతే మరొకరికి!

ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులకు ఈ నిర్ణయం కీలకంగా మారనుంది. నిర్మాణం మొదలుపెట్టని మంజూర్లు రద్దయితే ఆ ఇళ్లను ఇతర అర్హులకు కేటాయించనుండటంతో లబ్ధిదారుల జాబితాల్లో మార్పులకు అవకాశం ఏర్పడింది. ఇక మంజూరు పొందిన వారు నిర్మాణం ప్రారంభించేందుకు ఎంత గడువు ఇస్తారు? రద్దుకు ముందు నోటీసులు ఇస్తారా? నిర్మాణం ప్రారంభించలేకపోవడానికి ఆర్థిక లేదా ఇతర కారణాలున్న వారికి ఏమైనా వెసులుబాటు ఉంటుందా? అనే అంశాలపై అమలు మార్గదర్శకాల్లో మరింత స్పష్టత రావాల్సి ఉంది.

# 22ఏ భూములపై.. ఎన్‌హెచ్ఆర్సీ జోక్యం!

(మొదటిపేజీ తరువాయి)

జారీ చేసి నాలుగు వారాల్లో సమగ్ర నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది. ధరణి నుంచి భూ భారతి పోర్టల్‌కు మార్పు సమయంలో ప్రైవేట్ పట్టా భూములు, ఇళ్ల స్థలాలు 22ఏ నిషేధిత జాబితాలో చేరాయని అడ్వకేట్ కరుపోతుల రేవంత్ ఎన్‌హెచ్ఆర్సీకి ఫిర్యాదు చేశారు. ముందస్తు నోటీసులు, గెజిట్ నోటిఫికేషన్ లేకుండానే ఆస్తులను నిషేధిత జాబితాలో పెట్టారని ఆరోపించారు. దీంతో సంబంధిత భూముల అమ్మకాలు, తనఖాలు నిలిచిపోయి యజమానులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు.

**ఇప్పటికే హైపవర్ కమిటీ**

22ఏ చిక్కుల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. పెండింగ్ కేసులు, నిషేధిత జాబితాలో చిక్కుకున్న ఆస్తులు సహా వివిధ భూ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టింది. 22ఏ సమస్యలను నిర్ణీత గడువులో పరిష్కరిస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలోనే ఎన్‌హెచ్ఆర్సీ జోక్యం చేసుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**ఇప్పుడు సీఎస్ నివేదికే కీలకం**

ప్రైవేట్ ఆస్తులు ఏ ప్రాతిపదికన 22ఏ జాబితాలో చేరాయి? అందుకు అనుసరించిన విధానం ఏమిటి? బాధితుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టింది? అనే అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే నివేదిక కీలకం కానుంది. నాలుగు వారాల్లో సీఎస్ సమర్పించే నివేదికను పరిశీలించిన అనంతరం ఎన్‌హెచ్ఆర్సీ తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

# ఓటరు లెక్కలు.. త్వరగా తేల్చండి!

(మొదటిపేజీ తరువాయి)

ఆదేశించారు. ఆధార పత్రాలు సమర్పించేందుకు ఓటర్లకు తగిన సమయం ఇవ్వాలని, అవసరమైన పత్రాలపై బీఎల్‌వోలు సరైన మార్గనిర్దేశం చేయాలని చెప్పారు. బూత్ లెవల్ ఏజెంట్లు ఓటర్లకు నోటీసులు అందించరాదని సీఈవో స్పష్టం చేశారు. ఇళ్లను గుర్తించడంలో బీఎల్‌వోలకు సహకరించడం వరకే వారి పాత్ర ఉండాలన్నారు. అవసరమైన చోట అదనపు కంప్యూటర్ ఆపరేటర్లను వినియోగించి పెండింగ్ కేసులను క్లియర్ చేయాలని సూచించారు. దివ్యాంగులు, వృద్ధులను అనవసరంగా ప్రత్యక్ష విచారణకు పిలవొద్దని, ఎన్ఆర్ఐలు అధీకృత ప్రతినిధుల ద్వారా పత్రాలు సమర్పించేందుకు అవకాశం కల్పించాలని తెలిపారు. అనర్హతగా గుర్తించిన కేసుల్లో పూర్తి ప్రక్రియ పాటించిన తర్వాతే కారణాలతో కూడిన 'స్పీకింగ్ ఆర్డర్లు' ఇవ్వాలని ఆదేశించారు. ఎస్ఐఆర్‌కు సంబంధించిన సమాచారం, ఫారాలను నోటీసు బోర్డుల్లో ప్రదర్శించడంతో పాటు రాజకీయ పార్టీలతోనూ పంచుకుని ప్రక్రియ మొత్తం పారదర్శకంగా నిర్వహించాలని సీఈవో స్పష్టం చేశారు.

# 248 టీఎంసీలు వచ్చాయ్.. 28 టీఎంసీలే వాడారా?

(మొదటిపేజీ తరువాయి)

ప్రశ్నించారు. జూరాల ఆయకట్టులో పంటలు నీటి కోసం ఎదురుచూస్తున్నా విడుదల చేయకపోవడాన్ని కేటీఆర్ తప్పుబట్టారు. రైతులే రెగ్యులేటర్ గేట్లు తెరిచి నీరు వదులుకోవాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని నిలదీశారు. కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల్లో నీరు అందుబాటులో ఉందని పేర్కొంటూ.. అక్కడి ప్రభుత్వంతో మాట్లాడి 5-10 టీఎంసీలు తెప్పించి పంటలను కాపాడాలని డిమాండ్ చేశారు. జూరాల వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించిన రైతులు, బీఆర్ఎస్ నేతలను పోలీసులు అడ్డుకోవడం, పలువురిని అదుపులోకి తీసుకోవడంపైనా కేటీఆర్ మండిపడ్డారు. రైతుల సమస్యను పరిష్కరించకుండా ఆందోళనలను అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు. సాగునీరు విడుదల చేయకపోతే ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. మరోవైపు నీటి కొరతతో పాటు తాగునీటి అవసరాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉందని ప్రభుత్వం చెబుతోంది. దీంతో కృష్ణా నుంచి రాష్ట్రానికి వాస్తవంగా ఎంత నీరు అందుబాటులోకి వచ్చింది? ఎంత వినియోగించారు? ఎంత దిగువకు వెళ్లింది? జూరాలకు ఎంత విడుదల చేయగలరు? అన్న లెక్కలపై ఇప్పుడు చర్చ కేంద్రీకృతమైంది.

**లెక్కలు బయటపెడితేనే స్పష్టత!**

కేటీఆర్ చెబుతున్న 248-28 టీఎంసీల లెక్కలపై ప్రభుత్వం అధికారిక గణాంకాలతో పూర్తి వివరాలు వెల్లడిస్తేనే స్పష్టత రానుంది. అధికార--ప్రతిపక్షాల జలలెక్కల మధ్య జూరాల ఆయకట్టు రైతులు మాత్రం పంటలకు నీరు ఎప్పుడు అందుతుందోనని ఎదురుచూస్తున్నారు.

# ఇసుక అక్రమాలకు.. ఇక చెక్!

(మొదటిపేజీ తరువాయి)

ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి నిరంతరం నిఘా పెట్టాలని సూచించారు. విజిలెన్స్ బృందాలతో ఆకస్మిక తనిఖీలు, దాడులు నిర్వహించి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని స్పష్టం చేశారు. ఇసుక, ఖనిజాల అక్రమ రవాణాపై వచ్చే ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా తక్షణమే స్పందించాలని సీఎస్ ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు శాఖలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచాలని సూచించారు.

**ఆదాయం పెరగాలి**

రాష్ట్రంలోని ఖనిజ వనరులను సమర్థవంతంగా వినియోగించడం ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయాన్ని పెంచాలని సీఎస్ సూచించారు. ఇందుకు అవసరమైన కార్యాచరణను రూపొందించి అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూనే ఆదాయ సమీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

**ఖాళీల భర్తీ వేగంగా..**

గనులు, భూగర్భ వనరుల శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీతో పాటు ఉద్యోగుల పదోన్నతుల ప్రక్రియను నిబంధనల మేరకు వేగవంతం చేయాలని సీఎస్ ఆదేశించారు. సిబ్బంది కొరత శాఖ కార్యకలాపాలపై ప్రభావం చూపకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమీక్షలో మైన్స్ అండ్ జియాలజీ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ డి.ఎస్.చౌహాన్, ఐటీ అండ్ సీ సంయుక్త కార్యదర్శి, మైన్స్ డైరెక్టర్ అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

# విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా కుంకుమ పూజ, మహా అన్నదానం

- భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మహిళలు





**మల్హర్, సెప్టెంబర్ 21, (మన విశ్వం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలంలోని తాడిచెర్ల గ్రామంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కుంకుమ పూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని మంగళ వాయిద్యాలు, ఆధ్యాత్మిక వాతావరణం నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో కుంకుమార్చనలు సమర్పించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. మహిళల భక్తి, ఆధ్యాత్మిక చింతనతో కార్యక్రమ ప్రాంగణం భక్తిమయంగా మారింది. కుంకుమ పూజ సందర్భంగా ఒజేల రాజబాబు చారి, శంకరయ్య చారి ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు, సంఘ సభ్యులు, గ్రామస్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. విశ్వబ్రాహ్మణుల ఐక్యతను పెంపొందించడంతో పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా సమాజంలో భక్తి భావాన్ని పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కుంకుమ పూజతో పాటు మహా అన్నదానం నిర్వహించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలోజు సత్యనారాయణ, కందుకూరి మొగిలి, ఉట్నూరీ రవి, అనసూరి మొండయ్య, పోలోజు రాము, ఒజేల చంద్ర చారి, అనసూరి రమేష్,నూతి శ్రీకాంత్, నూతి సతీష్, నూతి నరేష్,నూతి, మహేష్,సంతోష్,లోకేష్,విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు, సభ్యులు, మహిళలు, యువత, గ్రామస్థులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి 'అమ్మ దీవెన చేయూత' ఆర్థిక సాయం

- రూ.5 వేల అందజేత.. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా



**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 21(మన విశ్వం):** 248 డివిజన్ వెంకటేశ్వర్‌నగర్ రిక్షా పుల్లర్స్ కాలనీ పరిధిలోని ఆర్‌పీ కాలనీ రోడ్ నంబర్ 29లో నివసిస్తున్న రాజు తండ్రి గంగారపు సోమయ్య అకాల మరణం పట్ల 'అమ్మ దీవెన చేయూత కమిటీ' సభ్యులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి అండగా నిలుస్తూ కమిటీ తరఫున రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కష్టకాలంలో నిరుపేద, బాధిత కుటుంబాలకు తమ వంతు చేయూత అందించడమే లక్ష్యంగా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. సోమయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో దేశపాక లింగయ్య, దొరపల్లి పరశురాములు, చిన్న ముందంగుల యాదగిరి, దొరపల్లి అంజయ్య, వల్లూరి బాబు, బాకూరు గణేష్, భాషిపాక యాదగిరి, ఎడ్ల ఏంకులు, చింత రవి, అల్వాల రమేష్, మల్లెల మల్లేష్, కంచర్ల సంతోష్, పల్నాటి రవీందర్, భాషిపాక కిరణ్, వేముల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి అర్జీలపై నిర్లక్ష్యం వద్దు: నిర్మల్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

**ముధోల్(నిర్మల్ కలెక్టరేట్), సెప్టెంబర్ 21(మన విశ్వం):** ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అర్జీల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకుంటూ దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఎన్నో ఆశలతో తమ సమస్యలు తీరుతాయనే నమ్మకంతో ప్రజావాణికి వస్తుంటారని, వారి నమ్మకాన్ని అధికారులు వమ్ము చేయవద్దని సూచించారు. ఆయా శాఖల అధికారులు ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి తక్షణమే స్పందించాలన్నారు. సమస్యల పరిష్కారంలో జాప్యం చేయకుండా, బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా చొరవ చూపాలని ఆదేశించారు. విధి నిర్వహణలో అలసత్వాన్ని ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు మరియు కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారానికే 'ప్రజావాణి'

- కుబీర్ మండల పరిషత్ కార్యాలయంలో కార్యక్రమం
- మూడు దరఖాస్తుల స్వీకరణ




**ముధోల్ (కుబీర్),సెప్టెంబర్ 21 (మన విశ్వం):** ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా 'ప్రజావాణి' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో భూమారావు తెలిపారు. సోమవారం కుబీర్ మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న అర్జీలను, సమస్యలను ప్రజావాణిలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ రోజు నిర్వహించిన కార్యక్రమానికి మొత్తం మూడు దరఖాస్తులు వచ్చినట్లు ఆయన వెల్లడించారు. ప్రజావాణిలో దాదాపు 20 శాఖలకు సంబంధించిన అధికారులు అందుబాటులో ఉంటారని, ఈ చక్కటి అవకాశాన్ని మండల ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో భీమేష్‌తో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# డీజే నిర్వాహకులకు ఎస్ఐ కీలక సూచనలు




**టేకుమట్ల.సెప్టెంబర్21(మన విశ్వం)** గణేష్ నిమజ్జనాలలో డీజేలు,సౌండ్ సిస్టమ్స్ వినియోగించవద్దని డీజే నిర్వాహకులను హెచ్చరించారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ లో డిజె నిర్వాహకులతో ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాలలో గణపతి నిమజ్జన సమయంలో డీజే సౌండ్ సిస్టంలు ఉపయోగించకూడదని ఎస్సై జి.అమూల్య అవగాహన కల్పించారు. డిజె సౌండ్ సిస్టం నిర్వాహకులను,వాహనదారులను తహసిల్దార్ వద్ద బాండోవర్ చేయించారు. సౌండ్ సిస్టం వాడినట్లయితే ఒకరికి లక్ష రూపాయలు జరిమానా,మూడు నెలలు జైలు శిక్ష ఉంటుంది అని తహసిల్దార్ స్వరూప రాణి,ఎస్సై జి అమూల్య హెచ్చరించారు.

# తానూర్ మండలంలో ఘనంగా 11వ ఆయుర్వేద దినోత్సవం

- ఆరోగ్యకరమైన రేపటి కోసం ఆయుర్వేదం





**ముధోల్ (తానూర్), సెప్టెంబర్ 21(మన విశ్వం):** నేటి ఆధునిక కాలంలో ఆయుర్వేదం, సమతుల్య పోషకాహారం, యోగా సాధన ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. 11వ ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని "ఆరోగ్యకరమైన రేపటి కోసం ఆయుర్వేదం" అనే నినాదంతో మండల వ్యాప్తంగా పలు అవగాహన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో 'పోషణ్ అభియాన్' కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తానూర్ మండల కేంద్రంలోనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (ప్రాఆక) పరిధిలోని ఆశా కార్యకర్తలకు,గర్భిణులకు పోషకాహారం ప్రాముఖ్యతపై మరియు ఔషధ మొక్కల విశిష్టతపై ప్రత్యేక ప్రదర్శనను ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో అవగాహన పెంపొందించాలిఅదేవిధంగా కొల్లూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (గ్రాఉపా)లో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ జె.లలిత మాట్లాడుతూ.. నిత్య జీవితంలో ఆయుర్వేద జీవన విధానం,సమతుల్య పోషకాహారం పాత్రను విద్యార్థులకు కూలంకషంగా వివరించారు. చుట్టుపక్కల లభించే ఔషధ మొక్కలతో చేకూరే ఆరోగ్య ప్రయోజనాలను వివరించారు. అనంతరం ప్రముఖ యోగా శిక్షకులు శ్రీ పోతన్న విద్యార్థులకు నిత్యం ఉపయోగపడే పలు యోగాసనాలను స్వయంగా ప్రదర్శించి చూపించారు. శారీరక, మానసిక దృఢత్వానికి యోగా ఎంతగానో దోహదపడుతుందని ఈ సందర్భంగా ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో విట్టల్ కూడా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో తన వంతు సహకారాన్ని అందించారు. ఈ సదస్సులో స్థానిక ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# నూతన సబ్ కలెక్టర్‌కు ఎమ్మెల్సీ దండే విఠల్ శుభాకాంక్షలు

శాలువాతో సన్మానం.. పుష్పగుచ్ఛంతో అభినందనలు



**కొమరం భీం, సెప్టెంబర్ 21(మన విశ్వం):** కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన హార్ష్ చౌదరిని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్‌ను శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. హార్ష్ చౌదరి ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ ప్రాంత అభివృద్ధితో పాటు ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి మరింత ప్రాధాన్యం లభించాలని ఎమ్మెల్సీ దండే విఠల్ ఆకాంక్షించారు.

# ప్రాజెక్టుల భూసేకరణ వేగవంతం చేయాలి

- ●ఆర్అండ్ఆర్ పనుల్లో జాప్యం వద్దు: మంత్రి ఉత్తమ్
- ●2026--27లో భూసేకరణకు రూ.6 వేల కోట్ల వరకు నిధులు
- ●ఇప్పటికే రూ.2,550 కోట్లు విడుదల.. లబ్ధిదారులకు చేరేలా చర్యలు
- ●అవార్డులు జారీ చేసిన భూములకు తక్షణమే పరిహారం
- ●ప్రత్యేక అధికారుల నియామకం.. ప్రతి వారం పురోగతిపై సమీక్ష
- ●రైతులతో చర్చించి మార్కెట్ విలువకు సమీపంగా పరిహారం ఇవ్వాలని ఆదేశం



**ములుగు జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 21(మన విశ్వం):** నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణతో పాటు అటవీ భూముల పరిహారం, పునరావాస--పునర్నిర్మాణ (ఆర్అండ్ఆర్) పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పెండింగ్ పనులను అత్యంత ప్రాధాన్యంతో పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

సోమవారం రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ, ఆర్అండ్ఆర్ పనుల పురోగతిపై రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో కలిసి జిల్లా కలెక్టర్లతో ఉత్తమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 2026--27 ఆర్థిక సంవత్సరంలో భూసేకరణ కోసం రూ. 6 వేల కోట్ల వరకు నిధులు విడుదల చేయనున్నట్లు ఉత్తమ్ తెలిపారు. ఇప్పటికే రెండు విడతల్లో రూ. 1,050 కోట్లు, రూ. 1,500 కోట్లు కలిపి రూ. 2,550 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. విడుదలైన నిధులు అధికారుల వద్దే ఉండకుండా పరిహారం రూపంలో లబ్ధిదారులకు త్వరగా చేరేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైన చోట భూసేకరణ కోసం ప్రత్యేక అధికారులను నియమించి బాధ్యతలు అప్పగించాలని సూచించారు. నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజినీర్లు, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని, పురోగతిని ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదించాలని చెప్పారు. ఇప్పటికే విడుదల చేసిన నిధులను వినియోగించిన తర్వాత అవసరాన్ని బట్టి మరిన్ని నిధులు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. భూసేకరణలో రైతులతో నేరుగా సంప్రదింపులు జరపాలని ఉత్తమ్ సూచించారు. నిబంధనల ప్రకారం రైతులకు అన్యాయం జరగకుండా, మార్కెట్ విలువకు సాధ్యమైనంత సమీపంగా పరిహారం అందేలా చూడాలన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పూర్తయ్యేలోపు పెండ్లిపాకల రిజర్వాయర్‌కు అవసరమైన భూసేకరణను ప్రాధాన్యంతో పూర్తి చేయాలని ఆదేశించారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఇప్పటికే అవార్డులు జారీ చేసిన భూములకు పరిహారం చెల్లింపులను మొదటి ప్రాధాన్యంగా పూర్తి చేయాలన్నారు. పెండింగ్ భూసేకరణపై ప్రతి వారం సమీక్ష నిర్వహించాలని సూచించారు. సీఎస్ సంజయ్ జాజు మాట్లాడుతూ భూసేకరణ, ఆర్అండ్ఆర్‌కు సంబంధించిన పనులను వేగంగా పూర్తి చేసి పరిహారం నేరుగా రైతులకు చేరేలా కలెక్టర్లు చర్యలు చేపట్టాలని సూచించారు. ములుగు ఐడీఓసీ నుంచి జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, డీఎఫ్ఓ వికాస్ మీనా వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. జిల్లాలోని నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ, పరిహారం చెల్లింపులను నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆర్డీఓ కృష్ణవేణి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పాఠశాలల్లో ఎంఈఓ నరేందర్ తనిఖీ

### విద్యా ప్రమాణాల మెరుగుదలకు కృషి చేయాలని ఆదేశం



**ముధోల్(తానూర్), సెప్టెంబరు 21(మన విశ్వం):**

మండలంలోని పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, కల్పించిన మౌలిక వసతులను నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు మండల విద్యాధికారి (వీజూా) నరేందర్ తెలిపారు. సోమవారం ఆయన మండల పరిధిలోని సింగన్‌గావ్,దౌలాతాబాద్ ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని, మధ్యాహ్న భోజనం అమలు తీరును మరియు పాఠశాలల్లోని మౌలిక వసతులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. తరగతి గదుల్లో విద్యార్థుల చదువుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై పలు కీలక సూచనలు చేశారు. విద్యార్థుల్లో విద్యా ప్రమాణాల మెరుగుదలకు ప్రతి ఒక్కరూ ప్రత్యేక కృషి చేయాలని,నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన ఉపాధ్యాయులను ఆదేశించారు .

## ప్రజావాణికి ఒకే ఒక్క దరఖాస్తు!

### త్వరగా పరిష్కరిస్తాం: ఎంపీడీఓ శ్రీధర్



**ముధోల్ (తానూర్), సెప్టెంబర్ 21(మన విశ్వం):** నిర్మల్ జిల్లా తానూరు మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన కరువైంది. ఈ వారం కేవలం ఒకే ఒక్క దరఖాస్తు వచ్చినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) శ్రీధర్ తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం యథావిధిగా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీధర్ మాట్లాడుతూ.. తమ శాఖకు సంబంధించి ఈరోజు ఒక దరఖాస్తు అందినట్లు పేర్కొన్నారు. సదరు అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని,తమ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్సీ దండే విఠల్




**కొమరం భీం, సెప్టెంబర్ 21(మన విశ్వం ):** కాగజ్‌నగర్ పట్టణంలోని పెద్దవాగు సమీపంలో గణేష్ నిమజ్జనం సందర్భంగా మున్సిపాలిటీ, పోలీస్ యంత్రాంగం చేపడుతున్న ఏర్పాట్లను ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ పరిశీలించారు. కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ అర్ష్ చౌదరి, డీఎస్పీ వాహిదుద్దీన్‌లతో కలిసి ఆయన ఘాట్ వద్ద జరుగుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ... నిమజ్జనోత్సవానికి పెద్ద సంఖ్యలో తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఘాట్ వద్ద తగిన భద్రతా ఏర్పాట్లు, నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సదుపాయాలు మరియు ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో, సజావుగా ముగిసేందుకు అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో గణనాథునికి ప్రత్యేక పూజలు

### అన్నదానంలో పాల్గొన్న డీఎస్పీ, సీఐ



**కొమరం భీం, సెప్టెంబర్ 21(మన విశ్వం):** కాగజ్‌నగర్ పట్టణంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తా, ఎస్‌బీఐ బ్యాంక్ సమీపంలో త్రివర్ణ జనశక్తి మండలి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథునికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ డీఎస్పీ వాహిదొద్దీన్, రూరల్ సీఐ కుమారస్వామి గణనాథుని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ, సీఐలను ఎమ్మెల్సీ దండే విఠల్ శాలువాలతో సత్కరించారు.

# మద్యపాన నిషేధంపై అక్టోబర్ 2న కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయండి

**అక్టోబర్ 7న చలో అమరావతికి భారీగా తరలిరావాలి: ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ**



**ఎల్కతుర్తి, సెప్టెంబర్ 21 (మన విశ్వం ):** పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్--ఎంఎస్పీ ఆధ్వర్యంలో సోమవారం ఎల్కతుర్తి మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ ఎల్కతుర్తి మండల అధ్యక్షులు అడ్డూరి అనిల్ మాదిగ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హనుమకొండ జిల్లా ఇన్చార్జ్ ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ, సీనియర్ నాయకులు ఆరెపల్లి పవన్ మాదిగ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ మాట్లాడుతూ మద్యపాన నిషేధాన్ని కోరుతూ అక్టోబర్ 2న నిర్వహించనున్న కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మద్యపానంతో అనేక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రభుత్వం మద్యపాన నిషేధంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ చేపడుతున్న ఈ కార్యక్రమానికి ఎల్కతుర్తి మండలం నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. అదేవిధంగా అక్టోబర్ 7న చలో అమరావతి కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్--ఎంఎస్పీ నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. అమరావతిలో ఆరోజు నిర్వహించనున్న నూతన మండల జాతీయ సదస్సును విజయవంతం చేసేందుకు ఎల్కతుర్తి మండలం నుంచి భారీగా హాజరు కావాలని సూచించారు. ఎమ్మార్పీఎస్--ఎంఎస్పీ ఆధ్వర్యంలో చేపట్టే ఉద్యమ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు ప్రతి గ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు రావాలని ఏపూరి వెంకటేశ్వరరావు మాదిగ కోరారు. సీనియర్ నాయకులు ఆరెపల్లి పవన్ మాదిగ మాట్లాడుతూ సంఘం చేపట్టే కార్యక్రమాలను విజయవంతం చేయడంలో ప్రతి కార్యకర్త భాగస్వామి కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు ఫోరం నాయకులు బొంకూరి వంశీ మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల కార్యదర్శి చిలుముల వినోద్ మాదిగ, మండల నాయకులు అడ్డూరి నవీన్ మాదిగ, అల్లకొండ బాలు మాదిగతో పాటు ఎమ్మార్పీఎస్--ఎంఎస్పీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్రమ్యూజియంను పునరుద్ధరించాలి : సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు

**కొమురం భీం, సెప్టెంబర్ 21(మన విశ్వం )**



హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్స్‌లోని తెలంగాణ రాష్ట్ర మ్యూజియాన్ని సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు సందర్శించారు. మ్యూజియంలోని పురాతన విగ్రహాలు, కళాఖండాలు, బుద్ధుని అవశేషాలు, ఈజిప్షియన్ మమ్మీ తదితర చారిత్రక వస్తువులను పరిశీలించారు. మ్యూజియం తెలంగాణ ఘనమైన వారసత్వానికి ప్రతీక అని పేర్కొంటూ, కనీస నిర్వహణపై ప్రభుత్వం దృష్టిసారించి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడంతో పాటు పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# తహసీల్దార్ కార్యాలయం తరలింపు ఆలోచన విరమించుకోవాలి: ప్రజావాణిలో వినతి

**?మఠంపల్లి, సెప్టెంబర్ 21(మనం విశ్వం ):**
మఠంపల్లి మండల రెవెన్యూ కార్యాలయాన్ని (తహసీల్దార్ కార్యాలయం) ప్రస్తుత ప్రాంతం నుంచి ఇతర ప్రాంతానికి తరలించే ప్రయత్నాలను తక్షణమే విరమించుకోవాలని కోరుతూ సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు.?మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని వేరే ప్రాంతానికి తరలించేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఈ నిర్ణయం వల్ల మండల ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని శాఖల సేవలు ఒకే చోట ప్రజలకు అందుబాటులో ఉండేలా, సమీకృత మండల కార్యాలయాల భవన సముదాయం (ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్) పరిధిలోనే నూతన రెవెన్యూ కార్యాలయాన్ని నిర్మించాలని అధికారులను కోరారు.?ప్రజా సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారులు స్పందించి, కార్యాలయాన్ని ఇతర ప్రాంతాలకు తరలించే ఆలోచనను విరమించుకోవాలని, సమీకృత భవన సముదాయంలోనే తగిన స్థలం కేటాయించి నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేయడం జరగింది




# పట్టాలు ఇచ్చారు.. ఇళ్లు కట్టడం మర్చిపోయారు

### సబ్ కలెక్టర్‌కు పారిశుద్ధ్య కార్మికుల వినతి..



**కొమురం భీం, సెప్టెంబర్ 21(మన విశ్వం):** కాగజ్‌నగర్‌లోని పారిశుద్ధ్య కార్మికులకు 1992లోనే బోరిగాం సర్వే నంబర్ 101లో మూడు ఎకరాల స్థలం కేటాయించి పట్టాలు అందజేసినా, దశాబ్దాలు గడుస్తున్నా ఇళ్ల నిర్మాణం చేపట్టలేదని తెలంగాణ స్టేట్ సఫాయి కర్మచారి & స్కావెంజర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆవేదన వ్యక్తం చేసింది.పట్టాలు ఉన్నప్పటికీ నివాస గృహాలు లేక పారిశుద్ధ్య కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యను అధికారులు ప్రత్యేకంగా దృష్టిసారించి పరిష్కరించాలని కోరారు.ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్ర కుమార్ జంజోడ్, జంజోడ్ విను సింగ్ కలిసి కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. 1992లో స్థలం కేటాయించినప్పటి నుంచి ఇళ్ల నిర్మాణం జరగకపోవడంతో కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.అర్హులైన పారిశుద్ధ్య కార్మికులందరికీ పక్కా ఇళ్లు మంజూరు చేసి, పెండింగ్ సమస్యకు వెంటనే పరిష్కారం చూపాలని వారు డిమాండ్ చేశారు.

# ట్రైబల్ యూనివర్సిటీ నిర్మాణ పనులు పూర్తి చేయాలి

### - మంత్రి సీతక్క స్పందించాలి: ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామెర కిరణ్

**ములుగు జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 21(మన విశ్వం):**
సమ్మక్క--సారలమ్మ ట్రైబల్ యూనివర్సిటీ భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామెర కిరణ్ డిమాండ్ చేశారు.ములుగులో ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంత విద్యార్థులకు ఉన్నత విద్యను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ట్రైబల్ యూనివర్సిటీకి అవసరమైన మౌలిక సదుపాయాలను త్వరగా కల్పించాలన్నారు. నిర్మాణ పనుల్లో జాప్యం వల్ల విద్యార్థులు, అధ్యాపకులు, యూనివర్సిటీ కార్యకలాపాలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు




తీసుకోవాలని కోరారు.ములుగు జిల్లాకు కీలకమైన ఈ విద్యాసంస్థ అభివృద్ధిపై మంత్రి సీతక్క ప్రత్యేక దృష్టి సారించాలని, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కోరారు. విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్యతో పాటు పూర్తిస్థాయి మౌలిక వసతులు అందించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జాగటి రవితేజ, యూనివర్సిటీ విద్యార్థులు కార్తీక్, సుబ్బు, సిబ్టన్, వేణు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అన్నప్రసాద వితరణ చేసిన మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ డా. కొత్తపల్లి అనిత - శ్రీనివాస్ దంపతులు



**కొమురం భీం, సెప్టెంబర్ 21( మన విశ్వం ) :**
కాగజ్‌నగర్ పట్టణంలోని వివేకానంద కాలనీ, ఇండస్ట్రియల్ ఏరియాలో కొలువుదీరిన గణనాథుడి సన్నిధిలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ కొత్తపల్లి అనిత – శ్రీనివాస్ దంపతులు ఘనంగా అన్నప్రసాద వితరణ చేపట్టారు.ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులకు స్వయంగా అన్నదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కొత్తపల్లి అనిత మాట్లాడుతూ... పట్టణ ప్రజలందరికీ సర్వ విఘ్నాలు తొలగి, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలు కలగాలని విఘ్నేశ్వరుడిని ప్రార్థించినట్లు తెలిపారు. భక్తిశ్రద్ధలతో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో సంతృప్తిని ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రముఖులు, ఉత్సవ కమిటీ సభ్యులు, వార్డు ప్రజలు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

# ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

**టేకుమట్ల.సెప్టెంబర్ 21 (మన విశ్వం):**
టేకుమట్ల మండలంలోని రామకృష్ణపూర్ (వి) గ్రామంలో సోమవారం రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి ఎం.కళ్యాణి ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్ నాంపెల్లి వీరేశం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందడంతో పాటు శాశ్వత ఆహార భద్రతకు దోహదపడుతుందని తెలిపారు.సేంద్రియ వ్యవసాయం వల్ల నేలలోని సూక్ష్మజీవుల పెరుగుదలకు సహకరించి,నేల సారవంతం అవుతుందని వివరించారు.గ్రామ సర్పంచ్ నాంపెల్లి వీరేశం మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం ఉండడంతో గ్రామంలోని రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు. పంటలకు విచక్షణారహితంగా ఎరువులు, పురుగుమందులు వాడటం వల్ల నేల సారం కోల్పోయే ప్రమాదం ఉందని తెలిపారు.సెర్ప్ నోడల్ అధికారి ఎం.మణికుమార్ మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం ప్రాముఖ్యతను రైతులకు వివరించారు.జీవామృతం, ఘన జీవామృతం,సేంద్రియ ఎరువుల తయారీ విధానాలను రైతులకు



ప్రత్యక్షంగా వివరించారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి రాహుల్,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ స్పెషాలిటీల పేరిట నిలువు దోపిడీ!

- ●సౌకర్యాల్లేవు.. స్పెషల్ డాక్టర్లూ లేరు
- ●అనవసర టెస్టులతో అడ్డగోలుగా వసూళ్లు
- ●నిర్మల్ జిల్లా కలెక్టర్‌కు అంబేద్కర్ యువజన సంఘం' ఫిర్యాదు

**ముధోల్(నిర్మల్ రూరల్), సెప్టెంబర్ 21(మన విశ్వం):**
జిల్లా కేంద్రంతో పాటు పలు ప్రాంతాల్లో వెలిసిన ప్రైవేటు ఆసుపత్రులు పేద రోగుల రక్తాన్ని జుర్రుకుంటున్నాయి. రంగురంగుల రంగుల బోర్డులు, మల్టీ స్పెషాలిటీ హంగులతో కార్పొరేట్ స్థాయిలో బిల్డప్ ఇస్తూ సామాన్యులను నిలువునా ముంచుతున్నాయి. అర్హులైన డాక్టర్లు, కనీస వైద్య సదుపాయాలు లేకపోయినా..అన్నీ ఉన్నాయంటూ నమ్మబలుకుతూ అమాయక ప్రజల నుంచి అడ్డగోలుగా డబ్బులు గుంజుతున్న ఉదంతాలు నిర్మల్ జిల్లాలో కలకలం రేపుతున్నాయి.

**కలెక్టరేట్‌లో గోడు వెళ్లబోసుకున్న బాధితులు**
నిర్మల్ జిల్లాలో ప్రైవేటు దవాఖానాల నిర్వాహకులు చేస్తున్న అక్రమాలపై అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తుల రంజిత్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్‌కు రాతపూర్వక ఫిర్యాదు సమర్పించారు. ఈ సందర్భంగా బాధితులతో కలిసి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు.

**టెస్టేదో.. దోపిడీదో..**
అనంతరం బత్తుల రంజిత్ విలేకరులతో మాట్లాడుతూ.. ప్రైవేటు దవాఖానాల దోపిడీపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్ద పెద్ద ఆసుపత్రులు సూపర్ స్పెషాలిటీ,మల్టీ స్పెషాలిటీ అని బోర్డులు



తగిలించుకుని దోపిడీ కేంద్రాలుగా మారాయని ధ్వజమెత్తారు. హాస్పిటల్స్‌లో ఎలాంటి సౌకర్యాలు లేకపోయినా, అన్ని వసతులు ఉన్నాయని రోగులను నమ్మిస్తున్నారని మండిపడ్డారు. పేద ప్రజల బలహీనతలను ఆసరాగా చేసుకుని,అవసరం లేకపోయినా వేల రూపాయల విలువైన అనవసర టెస్టులు రాస్తూ డబ్బులు లాక్కుంటున్నారని ఆరోపించారు.స్పెషల్ డాక్టర్లు లేకపోయినా, ఉన్నారంటూ తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
తక్షణమే తనిఖీలు చేపట్టాలి

**నిబంధనలు ఉల్లంఘిస్తూ,**
బోర్డుల పేరుతో మోసాలకు పాల్పడుతున్న ఇలాంటి ప్రైవేటు ఆసుపత్రులపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తక్షణమే నిఘా పెట్టాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు స్వయంగా క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టి, బాధ్యులైన ఆసుపత్రి యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, నిరుపేదలకు న్యాయం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు, బాధితులు, తదితరులు పాల్గొన్నారు.

# గాయపడిన శారదకు పరామర్శ.. ఆర్థిక సాయం

### మాజీ ఎంపీటీసీ ఆది సునీత రఘు చేయూత



**టేకుమట్ల, సెప్టెంబర్ 21 (మన విశ్వం):** టేకుమట్ల మండల కేంద్రానికి చెందిన రాం కుమారస్వామి భార్య రాం శారద ప్రమాదవశాత్తు కాలువలో పడి కాలు విరగడంతో హనుమకొండలోని గార్డెన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న టేకుమట్ల మాజీ ఎంపీటీసీ సభ్యులు ఆది సునీత రఘు ఆస్పత్రికి వెళ్లి ఆమెను పరామర్శించారు.వైద్యులతో మాట్లాడి శారద ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యుల సూచనలు పాటిస్తూ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించి ఆమెకు మనోధైర్యం కల్పించారు. అనంతరం కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు.వారి వెంట ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడు మచ్చ శ్రీకాంత్, ఎంఎస్‌పీ మండల నాయకులు కోండ్ర ప్రశాంత్, కోండ్ర రాజేందర్ తదితరులు ఉన్నారు.

మన విశ్వం
VOICE OF THE PEOPLE-POWER OF TRUTH
తెలుగు దినపత్రిక

# అధికారులు, సర్పంచులు కలిసి పనిచేస్తేనే పల్లెల్లో ప్రగతి

**- భైంసా సమావేశంలో ఎమ్మెల్యే రామారావు పటేల్**



**ముధోల్(భైంసా),సెప్టెంబర్ 21(మన విశ్వం):** ప్రభుత్వ అధికారులు, గ్రామ సర్పంచులు పరస్పర సమన్వయంతో కలిసి పనిచేసినప్పుడే పల్లెల్లో ఆశించిన ప్రగతి సాధ్యమవుతుందని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ స్పష్టం చేశారు. నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో మండల పరిధిలోని వివిధ గ్రామాల సర్పంచులు తమ ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే.. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామాల్లోని అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని, అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో ప్రతి లబ్ధిదారునికి చేరేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు ఒకరికొకరు సహకరించుకుంటూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,వివిధ శాఖల అధికారులు మరియు సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

# భైంసాలో పోలీసుల భారీ ఫ్లాగ్ మార్చ్

**- భద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన భద్రత**
**- ప్రశాంతంగా నిమజ్జన వేడుకలు**
**జరుపుకోవాలి: నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల**

**ముధోల్ (భైంసా టౌన్), సెప్టెంబర్ 21(మన విశ్వం):** మంగళవారం భైంసా పట్టణంలో నిర్వహించబోయే గణేష్ నిమజ్జన శోభాయాత్రను పురస్కరించుకొని పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజల్లో నమ్మకాన్ని, భద్రతా భావాన్ని కల్పించేందుకు నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల నేతృత్వంలో సోమవారం పట్టణంలో పోలీసులు భారీ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుండి ప్రారంభమైన ఈ మార్చ్, పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగుతూ బస్టాండ్ ఎదురుగా ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ.. సమస్యాత్మక ప్రాంతంగా పేరొందిన భైంసాలో గత రెండేళ్లుగా నిమజ్జన శోభాయాత్రలు అత్యంత ప్రశాంత వాతావరణంలో ముగిశాయని గుర్తుచేశారు. పట్టణంలోని హిందూ, ముస్లిం సోదరులు ఎంతో సోదర భావంతో, ఒకరికొకరు సహకరించుకుంటూ పండుగలను జరుపుకోవడం అభినందనీయమన్నారు. ఈ ఏడాది కూడా అదే సద్భావనను చాటుతూ వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నిబంధనలు తప్పనిసరిఉత్సవ కమిటీ సభ్యులు, మండప నిర్వాహకులు నిమజ్జన శోభాయాత్రను ఎటువంటి ఆలస్యం లేకుండా వీలైనంత త్వరగా ప్రారంభించాలని ఎస్పీ సూచించారు. శోభాయాత్రలో ఉపయోగించే డీజేలు, సౌండ్ సిస్టమ్స్ పూర్తిగా నిర్దేశిత ధ్వని పరిమితికి లోబడి మాత్రమే ఉండాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. వేడుకలు సజావుగా సాగేందుకు ప్రజలు, నిర్వాహకులు పోలీస్ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ సాయికిరణ్, సీఐలు, ఎస్సైలు మరియు భారీ సంఖ్యలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




# ఒంటిమామిడిపల్లిలో ఘనంగా మహా అన్నదానం

**చత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి వేడుకలు**

**ఐనవోలు, సెప్టెంబర్ 21(మన విశ్వం):** ఒంటిమామిడిపల్లిలో గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. చత్రపతి శివాజీ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా ఆడెపు సుగుణ--కేదారి, కడుతూరి రజిత--మల్లారెడ్డి ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ ఓబీసీ మోర్చా జనరల్ సెక్రటరీ ఆడెపు విక్రమ్ మాట్లాడుతూ.. విద్యార్థులు భక్తిశ్రద్ధలు, నియమనిష్ఠలతో గణపతి నవరాత్రి ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగి సమాజంలో మంచి గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆడెపు స్రవంతి దయాకర్, వార్డు సభ్యులు మజ్జిగ రాజు, పొన్నాల రమారాజు, గూడ సునీల్, చెంచు మౌనిక రాజు, మాజీ ఎంపీటీసీ ఖర్దూరి రాజు, చత్రపతి శివాజీ యూత్ నిర్వాహకులు శివ గణేష్, మనోజ్, గోపీచంద్, రిషికర్, శివాత్మిక్, నాయకులు కొట్టం మోహన్, అనుముల ఆగారెడ్డి, పెల్లి లక్ష్మీబాయి, కన్నె స్వప్న మనోహర్, గోనె జ్యోతి తదితరులతో పాటు మహిళలు, యువకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# సంస్కృతి అవెన్యూస్‌లో ఘనంగా గణేష్ ఉత్సవాల ముగింపు

**రూ.2.75 లక్షలకు లడ్డూ కైవసం చేసుకున్న కురుకోండల శ్రీనివాస్**



**కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 21(మన విశ్వం):** గాజులరామారం 125వ డివిజన్ పరిధిలోని సంస్కృతి అవెన్యూస్ కాలనీలో 2026 గణేష్ ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా ముగిశాయి. కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి నామస్మరణతో కాలనీ అంతా ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఉత్సవాల్లో భాగంగా ఈ ఏడాది తొలిసారిగా నిర్వహించిన గణేష్ లడ్డూ వేలంపాట ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సంస్కృతి అవెన్యూస్ రోడ్ నంబర్--3కు చెందిన కురుకోండల శ్రీనివాస్ రూ. 2,75,116కు లడ్డూను కైవసం చేసుకున్నారు. తొలిసారి నిర్వహించిన వేలంపాటకు కాలనీవాసుల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో కాలనీ చైర్మన్ రాజారెడ్డి, వైస్ చైర్మన్ రాజనాల శ్రీనివాస్, ప్రెసిడెంట్ పాశం రమేష్‌రెడ్డి, సెక్రటరీ నారాయణరెడ్డి, ట్రెజరర్ బాలాజీ, సీనియర్ అడ్వైజర్ విజయ గురువారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రఘుతో పాటు కమిటీ సభ్యులు, కాలనీ పెద్దలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్సవాలను విజయవంతం చేసిన కాలనీవాసులందరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. వినాయకుడి ఆశీస్సులతో ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

# తండ్రి--కూతురి ప్రేమను చాటిన 'ఇరుముడి'

**భావోద్వేగానికి గురైన తాడిచెర్ల గ్రామ ప్రజలు**

**మల్హార్, సెప్టెంబర్ 21 (మన విశ్వం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హార్ మండలం తాడిచెర్ల గ్రామంలో ఫ్రెండ్స్ గజానన మండలి ఆధ్వర్యంలో 'ఇరుముడి' సినిమాను ప్రత్యేకంగా ప్రదర్శించారు. తండ్రి--కూతురి మధ్య ఉండే ఆప్యాయత, ప్రేమ, అనుబంధాన్ని హృదయానికి హత్తుకునేలా చూపించిన ఈ చిత్రం గ్రామ ప్రజలను భావోద్వేగానికి గురిచేసింది. సినిమా వీక్షించేందుకు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సినిమాలోని పలు భావోద్వేగ సన్నివేశాలు ప్రేక్షకుల కళ్లలో కన్నీళ్లు తెప్పించాయి. ముఖ్యంగా తండ్రి--కూతురి ప్రేమను ప్రతిబింబించిన సన్నివేశాలకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. పలువురు ప్రేక్షకులు కంటతడి పెట్టుకున్నారు. సినిమాలో హీరో రవితేజతో పాటు చిత్రాన్ని రూపొందించిన దర్శకులు, నటీనటులు, సాంకేతిక బృందాన్ని గ్రామ ప్రజలు అభినందించారు. ప్రస్తుత పరిస్థితుల్లో కుటుంబ విలువలు, బంధాలు, అనుబంధాలను ప్రతిబింబించే ఇలాంటి సినిమాలు చాలా అరుదుగా వస్తున్నాయని పలువురు పేర్కొన్నా రు. అదేవిధంగా గ్రామ ప్రజలకు మంచి సందేశాన్ని అందించే చిత్రాన్ని ప్రదర్శించిన ఫ్రెండ్స్ గజానన మండలి కమిటీ సభ్యులను గ్రామస్థులు అభినందించారు. వినోదంతో పాటు కుటుంబ బంధాల విలువను చాటి చెప్పే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. సినిమా ప్రదర్శనకు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా తాడిచెర్లలో 'ఇరుముడి' సినిమా ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.




# కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి



**ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 21 :** జిల్లా వ్యాప్తంగా మాజీ మంత్రి, తెలంగాణ ఉద్యమ నేత కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆశయాల సాధనకు పాటుపడాలని పలువురు నాయకుల పిలుపునిచ్చారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘ భవనంలో ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని జగ్జీవన్‌రాంచౌక్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మంగ, పద్మశాలి సంఘం నాయకులు శ్రీకాంత్, లింగయ్య, మోహన్, శంకర్, పుష్పలత, క్రాంతి, రేవతి, ధర్మయ్య, శ్యాం, మోహన్, అజయ్, రామన్న, రవి, వెంకటేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు కేశవరావు, మహేష్, రాజలింగు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు. వాంకిడి, : స్థానిక జేత్వాన్ బుద్ధ విహార్‌లో అంబేద్కర్ యువజన సంఘం, లక్ష్మణ్ సేవాసదన్, ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో లక్ష్మణ్ సేవాసదన్ సంస్థ చైర్మన్ గాదే అవినాష్, వైస్ చైర్మన్ అశోక్, ప్రధానకార్యదర్శి మడావి దౌలత్, కుమార్, అంబెద్కర్ యువజన సంఘం నాయకులు దుర్గం శ్యాంరావు, విలాస్, రాజేశ్వర్, రమేశ్, విఠల్, రోషన్, పాండుజీ, బుద్దాజీ, భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.: మండల కేంద్రంలో సోమవారం పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిం చారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సామల తిరుపతి, సభ్యులు వెంకటేష్, కనికుట్ల శ్రీనివాస్, శంకర్, శ్రీనివాస్, రమేశ్, గణేష్, , వెంకటేష్ పాల్గొన్నారు.

# రైతాంగం సుభిక్షంగా ఉండాలి: మోక్ష గణపతి వేడుకల్లో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

**ముధోల్ (లోకేశ్వరం), సెప్టెంబర్ 21(మన విశ్వం):** లోకేశ్వరం మండలంలోని అబ్దుల్లాపూర్ గ్రామంలో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కొలువైన మోక్ష గణపతిని ముథోల్ నియోజకవర్గ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు గ్రామస్తులు, ఆలయ కమిటీ ప్రతినిధులు మంగళవాయిద్యాలతో సాదర స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి సన్నిధిలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. తీర్థప్రసాదాల స్వీకరణ అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి,మోక్ష గణపతి జ్ఞాపికను బహూకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామారావు పటేల్ మాట్లాడుతూ.... విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో నియోజకవర్గంతో పాటు రాష్ట్రవ్యాప్తం గా వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని కోరు కున్నట్లు తెలిపారు. అన్నదాతలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సుభిక్షంగా ఉండాలన్నదే తమ ఆకాంక్ష అన్నారు. గ్రామీణ ప్రాం తాల్లో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల మధ్య ఐక్యతను పెంపొందిస్తాయని కొనియాడారు. రాబోయే పుష్కరాలను పురస్కరించుకుని ఆయన ఒక కీలక ప్రకటన చేశారు. వచ్చే ఏడాది నిర్వహించబోయే ఎ సందర్భంగా భక్తుల సౌకర్యార్థం 12 రోజుల పాటు నిరంతరాయంగా భారీ అన్నదాన కార్యక్రమాన్ని తన ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నాయకులు రాజేష్ బాబు, జోహార్ పూర్ సర్పంచ్ గైనీ దయానంద్ తో పాటు ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



మన విశ్వం
VOICE OF THE PEOPLE-POWER OF TRUTH
తెలుగు వార్తా దినపత్రిక
మంగళవారం,
సెప్టెంబర్ 22, 2026



# మహిళల క్రికెట్‌లో స్వర్ణ పతకానికి
# భారత్, శ్రీలంక ఢీ

### నేటి ఉదయం 10.30గం.ల నుంచి



**ఐచి-నగోయా(జపాన్):** ఆసియా క్రీడల మహిళల క్రికెట్లో భారత జట్టు శ్రీలంకతో తలపడనుంది. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన భారత మహిళల జట్టు మంగళవారం జరిగే ఫైనల్లో శ్రీలంకను ఓడిస్తే మరోసారి స్వర్ణ పతకం చేజిక్కించుకోనుంది. ఈ మ్యాచ్ జపాన్‌లోని నిషిన్ కోరోగీ స్పోర్ట్స్ పార్క్‌లో జరగనుంది. క్వార్టర్‌ఫైనల్లో బంగ్లాదేశ్‌పై 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించిన భారతజట్టులో ఓపెనర్లు షెఫాలీ వర్మ, స్మృతి మంధాన అద్భుత ఫామ్‌లో ఉన్నారు. బంగ్లాదేశ్‌పై షెఫాలీ కేవలం 49 బంతుల్లోనే 100 పరుగులు చేసి రికార్డు సెంచరీతో మెరిసింది. దీంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగి 20 ఓవర్లలో 195/4 పరుగులు చేయగా.. ఛేదనలో బంగ్లాదేశ్‌ను 81 పరుగులకే ఆలౌట్ చేసి 114 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో స్మృతి మంధాన మహిళల టీ20ల్లో అత్యధిక పరుగులు చేసిన ప్లేయర్‌గా ప్రపంచ రికార్డు సృష్టించింది. భారత జట్టు తరఫున ఫామ్‌లో ఉన్న షెఫాలీ వర్మ, స్మృతి మంధాన, కెప్టెన్ హర్మాన్‌ప్రీత్ కౌర్, ఆల్ రౌండర్ దీప్తి శర్మ మ్యాచ్ విన్నర్లుగా మారనుండగా.. శ్రీలంక జట్టు పూర్తిగా వారి స్టార్ కెప్టెన్ చమరి అతపత్తుపై ఆధారపడి ఉంది. ముఖాముఖి పోరులోనూ భారత్‌దే అగ్ర స్థానం. ఇప్పటివరకు మొత్తం 32 మ్యాచులు జరగ్గా.. భారత్ 26, శ్రీలంక 5మ్యాచుల్లో విజయం సాధించాయి. ఒక మ్యాచ్ రద్దయ్యింది. ఇప్పుడు ఆసియా గేమ్స్ ఫైనల్లోనూ ఈ రెండు జట్లు తలపడనున్నాయి. 2022 హ్యాంగ్‌జౌ ఆసియా గేమ్స్‌లో స్వర్ణం గెలుచుకున్న టీమిండియా,

ఈసారి కూడా టైటిల్‌ను కొట్టాలని చూస్తోంది. ఇక భారత్, శ్రీలంక మహిళలజట్లు ఆసియా కప్ ఫైనల్లో తలపడ్డాయి. బ్యాటింగ్‌కు దిగిన నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 183 పరుగులు చేయగా.. ఛేదనలో శ్రీలంకను కేవలం 111 పరుగులకే ఆలౌట్ చేసి 72పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తెలుగు తేజం, కడపకు చెందిన శ్రీచరణి(4/20) కెరీర్ బెస్ట్ బౌలింగ్‌లో చెలరేగి టీమిండియా గెలుపులో కీలకపాత్ర పోషించింది. జట్లు(అంచనా)...భారత మహిళలు: హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), మంధాన, షెఫాలీ వర్మ, కమిలిని, రీచా ఘోష్(వికెట్ కీపర్), ఫుల్మాలీ, దీప్తి శర్మ, శ్రేయాంక పాటిల్, శ్రీచరణి, నందిని శర్మ, క్రాంతి గాడ్.శ్రీలంక మహిళలు: ఆటపట్టు(కెప్టెన్), దిలానీ, హాసిని, హర్షిత, సమరవిక్రమ, దిల్హారీ, కరుణరత్నే, కౌషని(వికెట్ కీపర్), మిథాలీ, కవింది, చాముండి



## గురి తప్పని హిమాన్షు

20వ ఆసియా క్రీడల్లో మూడోరోజు భారత్‌కు మూడు పతకాలు దక్కాయి. షూటింగ్‌లో రజత, కాంస్యాలతోపాటు ఎంఎంఏలో మరో కాంస్య పతకం లభించింది. స్విమ్మింగ్‌లో శ్రీహరి నటరాజన్ ఫైనల్‌కు చేరగా.. పురుషుల బ్యాడ్మింటన్‌లో పురుషుల జట్టు బంగ్లాదేశ్‌ను ఓడించి ప్రీ క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. పురుషుల 10మీ. ఎయిర్ రైఫిల్ ఫైనల్లో హిమాన్షు దిల్లాన్ రజత పతకాన్ని, రుద్రాంక్ష? పాటిల్ కాంస్య పతకాన్ని సాధించగా.. మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్(ఎంఎంఏ)లో సుచికా తారియాల్ తృటిలో సెమీస్‌లో ఓడి కాంస్య పతకానికి పరిమితమైంది. 20వ ఆసియా క్రీడల్లో మూడోరోజు భారత్‌కు మూడు పతకాలు దక్కాయి. షూటింగ్‌లో రజత, కాంస్యాలతోపాటు ఎంఎంఏలో భారత్‌కు మరో కాంస్య పతకం లభించింది. స్విమ్మింగ్‌లో శ్రీహరి నటరాజన్ ఫైనల్‌కు చేరగా.. పురుషుల బ్యాడ్మింటన్‌లో భారత పురుషుల జట్టు బంగ్లాదేశ్‌ను ఓడించి ప్రీ క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. సోమవారం జరిగిన పురుషుల 10మీ. ఎయిర్ రైఫిల్ ఫైనల్లో హిమాన్షు దిల్లాన్ రజత పతకాన్ని, రుద్రాంక్ష పాటిల్ కాంస్య పతకాన్ని సాధించారు. మహిళల టేబుల్ టెన్నిస్‌లో పాకిస్థాన్‌పై భారత్ ఘన విజయం సాధించింది. **కబడ్డీ జట్టు శుభారంభం** భారత పురుషుల కబడ్డీ జట్టు శుభారంభం చేసింది. గ్రూప్-ఎలో భాగంగా సోమవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 49-24 పాయింట్ల తేడాతో ఆతిథ్య జపాన్‌ను ఓడించింది. ఎనిమిది సార్లు కబడ్డీ చాంపి యన్ భారత్ ముందు జపాన్ ఆటలు సాగలేదు. అర్ధభాగం ముగిసేసరికే భారత్ 31-9 పాయింట్లతో జపాన్‌పై స్పష్టమైన ఆధిక్యంలో నిలిచింది. రెండో అర్ధభాగంలోనూ 40-12తో దూకుడు కనబరిచింది. ఆశూ మాలిక్, దేవాంక్ దలాల్ ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. అయితే ఈ మ్యాచ్‌లో సీనియర్లు పవన్ సెహ్రావత్, అర్జున్ దేశ్వాల్, అస్లామ్ ఇనామ్‌దార్‌లు కొద్దిసేపు మాత్రమే బరిలోకి దిగారు. ఆశూ సూపర్ రైడ్‌తో మూడు టాకిల్ పాయింట్లు సాధించాడు. రెండో గ్రూప్ లీగ్ మ్యాచ్‌లో భారతజట్టు రిపబ్లిక్ ఆఫ్ కొరియాతో తలపడనుంది. **పురుషుల బ్యాడ్మింటన్ క్వార్టర్స్‌కు...** బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో భారతజట్టు క్వార్టర్ ఫైనల్లో అడుగుపెట్టింది. సోమవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో భారతజట్టు 3-0తో బంగ్లాదేశ్‌పై విజయం సాధించింది. తొలి సింగిల్స్‌లఓ లక్ష్యసేన్ 21-4, 21-12తో జమాన్ అయ్‌మన్‌పై, రెండో సింగిల్స్‌లఓ ఆయు శ్ శెట్టి 21-4, 21-13తో గౌరబ్ సింఘూపై, చివరి మ్యాచ్‌లో కిదాంబి శ్రీకాంత్ 21-15, 21-9తో జుమర్ అల్ అమిన్‌పై విజయం సాధిం చారు. మంగళవారం జరిగే క్వార్టర్‌ఫైనల్లో భారత పురుషుల జపాన్ జట్టుతో తలపడనుంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే భారత్ పతకం ఖాయం కానుంది.

## న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్.. రిజర్వ్ ఓపెనర్ రేసులో సాయి సుదర్శన్



ఇంటర్నెట్ డెస్క్: గాయం బారిన పడిన భారత యువ బ్యాటర్ సాయి సుదర్శన్ కోలుకున్నాడు. ఆస్ట్రేలియా-ఎ, భారత్-ఎ మధ్య మంగళవారం నుంచి ప్రారంభం కానున్న నాలుగు రోజుల ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లో అతడు ఓపెనర్‌గా బరిలోకి దిగనున్నాడు. ఈ మ్యాచ్‌లో రాణించి న్యూజిలాండ్ పర్యటనకు భారత టెస్టు జట్టులో రిజర్వ్ ఓపెనర్ స్థానాన్ని దక్కించుకోవాలని భావిస్తున్నాడు.సాయ్ సుదర్శన్ ఇప్పటివరకు భారత్ తరఫున ఏడు టెస్టులు ఆడాడు. అయితే ఆ మ్యాచ్‌ల్లో మూడో స్థానంలో బ్యాటింగ్ చేశాడు. ఇటీవల శ్రీలంక పర్యటనలో భారత్- ఎ తరఫున ఓపెనర్‌గా బరిలోకి దిగిన అతడు రెండు ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో వరుసగా 132, 168 పరుగులు చేశాడు. అయితే ఆ తర్వాత కాలికి ఫ్రాక్చర్ కావడంతో టెస్టు సిరీస్‌కు దూరమయ్యాడు. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో సుమారు ఆరు వారాల పాటు పునరావాసం తీసుకుని తాజాగా పూర్తి ఫిట్‌నెస్ సాధించాడు. **రిజర్వ్ ఓపెనర్ స్థానం కోసం..** భారత్ టెస్టు జట్టులో రిజర్వ్ ఓపెనర్ స్థానం కోసం సుదర్శన్‌తో పాటు అమన్ మొఖాడే కూడా పోటీ పడుతున్నాడు. మరోవైపు భారత్-ఎ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న దేవదత్ పడిక్కల్ శ్రీలంకలో జరిగిన గత సిరీస్‌లో రెండు సెంచరీలు సాధించి టెస్టు జట్టులో మూడో స్థానాన్ని దాదాపు ఖాయం చేసుకున్నాడు. దీంతో సుదర్శన్ మరోసారి ఓపెనింగ్ స్థానంపై దృష్టి పెట్టాల్సి వచ్చింది. భారత టెస్టు జట్టులో వన్ డౌన్ బ్యాటర్, రిజర్వ్ స్పిన్నర్ స్థానాలపై సెలెక్టర్లు దృష్టి సారించారు. జనవరి చివరి వారం నుంచి మార్చి తొలి వారం వరకు జరగనున్న బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ నేపథ్యంలో ఈ స్థానాలకు ప్రాధాన్యం పెరిగింది. **రెండు లక్ష్యాలతో సిరీస్..** ఆస్ట్రేలియా-ఎ పర్యటనకు భారత్ రెండు ప్రధాన లక్ష్యాలతో సిద్ధమవుతోంది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో ఐదు టెస్టులు ఉండటంతో.. ఆటగాళ్లకు గాయాలు లేదా ఫిట్‌నెస్ సమస్యలు తలెత్తినప్పుడు వారి స్థానాలను భర్తీ చేయగల ఆటగాళ్లను గుర్తించడం ఒక లక్ష్యం. అదే సమయంలో న్యూజిలాండ్‌లో జరగనున్న మూడు టెస్టుల పర్యటనకు ఎంపిక చేసేందుకు ఆటగాళ్లను కూడా సెలెక్టర్లు పరిశీలించనున్నారు.




## భారత్-జపాన్ స్పెషల్ టీ20కి టైఫూన్ ముప్పు.

ఇంటర్నెట్ డెస్క్: భారత క్రికెట్ జట్టు చారిత్రక మ్యాచ్‌కు సిద్ధమవుతోంది. మంగళవారం భారత్, జపాన్ పురుషుల జట్లు తొలిసారి అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లో తలపడనున్నాయి. 75 ఏళ్ల దౌత్య అనుబంధానికి గుర్తుగా ఈ మ్యాచ్ నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అయితే జపాన్‌లో టైఫూన్ ప్రభావంతో భారీ వర్షాలు, తుపాను పరిస్థితులు నెలకొనడంతో ఈ మ్యాచ్‌పై వాతావరణ ప్రభావం ఉంటుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.భారత్-జపాన్ స్పెషల్ టీ20 మ్యాచ్ సానో ఇంటర్నేషనల్ క్రికెట్ గ్రౌండ్‌లో జరగనుంది. ఈ స్టేడియం కాంటో ప్రాంతంలోని టోచిగి ప్రిఫెక్చర్‌లో ఉంది. తుపాను ప్రభావం ఈ ప్రాంతంపైనా ఉండే అవకాశం ఉండటంతో మ్యాచ్ నిర్వహణపై సందేహాలు తలెత్తాయి. జపాన్ వాతావరణ సంస్థ ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించింది. కొండచరియలు విరిగిపడటం, బలమైన గాలులు, వరదలు సంభవించే అవకాశం ఉందని హెచ్చరించింది. అయితే ప్రస్తుతం వాతావరణ అంచనాల ప్రకారం.. మంగళవారం మ్యాచ్‌కు దీర్ఘకాలికంగా భారీ వర్షం అంతరాయం కలిగించే అవకాశాలు తక్కువగానే కనిపిస్తున్నాయి.సోమవారం భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నప్పటికీ.. మంగళవారం ఉదయం వాతావరణ పరిస్థితులు మెరుగుపడే సూచనలు ఉన్నట్లు తెలుస్తోంది. కొన్ని ప్రాంతాల్లో ఎండ కూడా కనిపించే అవకాశం ఉంది. అయితే మధ్యాహ్నం సమయంలో చిరుజల్లులు పడే అవకాశాలు ఉండటంతో.. మ్యాచ్‌కు స్వల్ప అంతరాయం కలగొచ్చు. అయితే మ్యాచ్ పూర్తిగా రద్దయ్యేంత స్థాయిలో సుదీర్ఘమైన భారీ వర్షం సూచనలు కనిపించడం లేదని తెలుస్తోంది.

## ఆసియా గేమ్స్: కుమారుడి టీమ్ ఓటమి..

**ఇంటర్నెట్ డెస్క్:** ఆసియా క్రీడల్లో భారత స్విమ్మింగ్ బృందానికి మరోసారి నిరాశ ఎదురైంది. నటుడు ఆర్. మాధవన్ కుమారుడు వేదాంత్ పాల్గొన్న పురుషుల 4ఇ200 మీటర్ల ఫ్రీ స్టైల్ రిలే జట్టు ఫైనల్‌కు అర్హత సాధించలేకపోయింది. కేవలం 0.2 సెకన్ల తేడాతో ఫైనల్ బెర్త్‌ను కోల్పోయింది. దీంతో వేదాంత్ తన నిరాశను సోషల్ మీడియాలో పంచుకోగా.. తండ్రి మాధవన్ స్పందించాడు.సాజన్ ప్రకాశ్, దక్షన్ శశికుమార్, అనీష్ సునీల్‌తో కలిసి వేదాంత్ భారత రిలే జట్టులో బరిలోకి దిగాడు. సోమవారం జరిగిన క్వాలిఫికేషన్‌లో భారత జట్టు 7:24.32 సెకన్లలో రేసును పూర్తి చేసి 13 జట్లలో తొమ్మిదో స్థానంలో నిలిచింది. టాప్-8 జట్లు మాత్రమే ఫైనల్‌కు అర్హత సాధించాయి. ఎనిమిదో స్థానంలో నిలిచిన ఖతార్ 7:24.10 టైమింగ్ నమోదు చేసింది. దీంతో భారత్ కేవలం 0.22 సెకన్ల తేడాతో ఫైనల్ అవకాశాన్ని కోల్పోయింది. దీంతో వేదాంత్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో తన నిరాశను వ్యక్తం చేశాడు. '0.2 సెకన్ల తేడాతో ఫైనల్ మిస్ అయ్యాం. భారత జట్టులో అత్యుత్తమ టైమింగ్‌కు 0.5 సెకన్ల దూరంలో ఉన్నాను' అంటూ వేదాంత్ పోస్టు చేశాడు.ఈ స్టోరీని మాధవన్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ.. గ్రాటిట్యూడ్ ఎమోజీని జత చేశాడు. కొడుకు ప్రదర్శనపై గర్వంగా ఉన్నాననే భావాన్ని ఆయన తన స్పందన ద్వారా తెలియజేశాడు. వేదాంత్‌కు ఇంకా రెండు వ్యక్తిగత ఈవెంట్లు ఉన్నాయి. సెప్టెంబర్ 23న 200 మీటర్ల ఫ్రీస్టైల్, సెప్టెంబర్ 25న 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో అతడు పోటీపడనున్నాడు.

## చెన్నై సూపర్ కింగ్స్ హెడ్ కోచ్‌గా జహీర్ ఖాన్




**హైదరాబాద్ :** చెన్నై సూపర్ కింగ్స్ జట్టు హెడ్ కోచ్‌గా టీమ్‌ఇండియా మాజీ పేసర్ జహీర్ ఖాన్ నియమితులయ్యారు. ఈ విషయాన్ని సీఎస్‌కే తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో ప్రకటించింది. కొన్ని నెలల క్రితమే హెడ్ కోచ్ పదవి నుంచి న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ స్టీఫెన్ ఫ్లెమింగ్ వైదొలగిన సంగతి తెలిసిందే. ఆయన ఐపీఎల్ 2008వ సీజన్ నుంచి చెన్నైతోనే ఉన్నాడు.

## మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్‌లో భారత్‌కు తొలి పతకం




**హైదరాబాద్:** జపాన్‌లో జరుగుతున్న ఆసియా క్రీడల్లో భారత క్రీడాకారిణి సుచికా తరిణాల్ చారిత్రాత్మక పతకం సాధించారు. మహిళల ట్రెడిషనల్ 60 కేజీల మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ విభాగంలో ఆమె కాంస్య పతకం దక్కించుకున్నారు. సెమీఫైనల్లో సింగపూర్‌కు చెందిన హుయ్ హూన్ టియోతో సుచికా హోరాహోరీగా తలపడ్డారు. నిర్ణీత సమయం ముగిసే సరికి పోరు డ్రాగా ముగిసింది. దీంతో తక్కువ బరువు ఉన్న క్రీడాకారిణిని విజేతగా ప్రకటించే నిబంధన ప్రకారం టియోను విజేతగా ప్రకటించారు. ఇద్దరు క్రీడాకారిణుల బరువుల్లో కేవలం 700 గ్రాముల తేడా ఉండటంతో ప్రత్యర్థి విజేతగా ప్రకటించారు. దీంతో సుచికా ఫైనల్ అవకాశాన్ని కోల్పోయి కాంస్యంతో సరిపెట్టుకున్నారు. తీర్పు ప్రకటించిన వెంటనే సుచికా తీవ్ర భావోద్వేగానికి గురై మైదానంలోనే కన్నీటి పర్యంతమయ్యారు. ఆసియా క్రీడల్లో మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ తొలిసారిగా ప్రవేశించిన ఈ ఏడాదే భారత్‌కు తొలి పతకం రావడం విశేషం. ఈ కాంస్యంతో ఆసియా క్రీడల్లో భారత్ మొత్తం పతకాల సంఖ్య ఆరుకు చేరింది. ఇప్పటివరకు షూటర్లు నాలుగు రజతాలు, ఒక కాంస్య పతకం సాధించారు.హర్యానాకు చెందిన 36 ఏళ్ల సుచికా.. 12 ఏళ్ల వయసులో తనకు ఎదురైన ఈవ్‌టీజింగ్ ఘటనతో పోరాట కళలు నేర్చుకోవడం ప్రారంభించారు. ఆ సంఘటన జరిగిన 24 ఏళ్ల తర్వాత ఆమెకు ఆసియా క్రీడల్లో చారిత్రాత్మక పతకం దక్కింది. అయితే ఈ విజయం ఆమెకు ఆనందాన్ని ఇవ్వకముందే తీవ్ర భావోద్వేగానికి గురిచేసింది.

# వెంకీ 'ఆదర్శ కుటుంబం' నుంచి ఫస్ట్ సింగిల్.. డేట్ ఫిక్స్!



విక్టరీ వెంకటేశ్, ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో వస్తున్న 'ఆదర్శ కుటుంబం' సినిమా నుంచి మేకర్స్ కీలక అప్‌డేట్ ఇచ్చారు. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమాలోని మొదటి పాట 'నారాయణమ్మ'ను రేపు(సెప్టెంబర్ 22న) విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. తమన్ స్వరాలు సమకూరుస్తున్న ఈ చిత్రంలోని 'నారాయణమ్మ' పాటను రామజోగయ్య శాస్త్రి రాశారు. ఇది ఒక మాస్ అండ్ ఎంటర్‌టైనింగ్ సాంగ్‌గా ఉండబోతోందని చిత్రబృందం తెలిపింది. ఆదిత్య మ్యూజిక్ ద్వారా ఈ పాట ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌పై వెంకటేశ్ అభిమానుల్లో, సాధారణ ప్రేక్షకుల్లో భారీ ఆశలు నెలకొని ఉన్నాయి. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ పతాకంపై ఎస్. రాధాకృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వెంకటేశ్ సరసన శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో మరో ఇద్దరు భామలు నివేదా పేతురాజ్, డింపుల్ హయాతి ప్రత్యేక పాత్రల్లో అలరించనున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి, 'ఆదర్శ కుటుంబం' చిత్రాన్ని అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

# ప్రారంభమైన 'ది ప్యారడైజ్' జాతర.. రికార్డు స్థాయిలో అడ్వాన్స్ బుకింగ్స్!



నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న 'ది ప్యారడైజ్' చిత్రంపై నెలకొన్న భారీ అంచనాలకు తగ్గట్టే అడ్వాన్స్ బుకింగ్స్‌కు అద్భుతమైన స్పందన లభిస్తోంది. ఈ గురువారం సినిమా విడుదల కానుండగా, నైజాం ప్రాంతంలో ప్రారంభమైన బుకింగ్స్ పోటెత్తాయి. బుకింగ్స్ మొదలైన కొద్ది సమయంలోనే రూ.1 కోటికి పైగా గ్రాస్ వసూలైనట్లు ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. గత రాత్రి డిస్ట్రిక్ట్ యాప్‌లో అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభించగా, ప్రేక్షకుల నుంచి అనూహ్యమైన స్పందన వచ్చింది. లక్షకు పైగా టికెట్లు అమ్ముడైనట్లు సమాచారం. దీంతో పలు షోలు ఇప్పటికే హౌస్‌ఫుల్ బోర్డులతో నిండిపోవడం సినిమాపై ఉన్న క్రేజ్‌ను స్పష్టం చేస్తోంది. మిగిలిన ప్రాంతాల్లోనూ పూర్తి స్థాయి అడ్వాన్స్ బుకింగ్స్ త్వరలోనే ప్రారంభం కానున్నాయి. ఈ స్థాయిలో స్పందన రావడం చూసి చిత్రబృందం హర్షం వ్యక్తం చేస్తోంది. బ్లాక్‌బస్టర్ చిత్రం 'దసరా' తర్వాత నాని, శ్రీకాంత్ ఓదెల కలయికలో వస్తున్న రెండో సినిమా కావడంతో 'ది ప్యారడైజ్'పై మొదటి నుంచి అంచనాలు ఆకాశాన్నంటాయి. ఈసారి కూడా విభిన్నమైన కథాంశంతో, బలమైన యాక్షన్ ఎలిమెంట్స్‌తో శ్రీకాంత్ ఓదెల ఈ చిత్రాన్ని తెరకెక్కించినట్లు తెలుస్తోంది. నాని గత చిత్రాలకు భిన్నమైన గెటప్‌లో కనిపించనుండటం కూడా అభిమానుల్లో ఆసక్తిని రెట్టింపు చేసింది. ఈ చిత్రంలో నానికి జోడీగా కయాదు లోహర్ నటిస్తుండగా, సీనియర్ నటుడు మోహన్ బాబు ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు.

సినిమా ప్రమోషన్లలో భాగంగా ఈరోజు హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో చిత్ర ప్రీ-రిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ ఈవెంట్‌లో అభిమానుల కోసం ఓ ప్రత్యేక సర్‌ప్రైజ్ కూడా ప్లాన్ చేసినట్లు చిత్రబృందం ప్రకటించడంతో ఈ కార్యక్రమంపై కూడా ఆసక్తి పెరిగింది. రాఘవ్ జుయల్, తనికెళ్ల భరణి కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీత సంచలనం అనిరుధ్ రవిచందర్ అందించిన సంగీతం మరో ప్రధాన ఆకర్షణగా నిలవనుంది.

# పెరుగుతున్న విడాకుల సంస్కృతిపై కాజల్ అగర్వాల్ ఆసక్తికర వ్యాఖ్యలు



దేశంలో విడాకులపై చర్చ పెరుగుతున్న వేళ నటి కాజల్ అగర్వాల్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మారుతున్న సంబంధాలు, ప్రేమ, పెళ్లిపై నేటి తరం ఆలోచనా విధానంలో సోషల్ మీడియా ప్రభావం ఎక్కువగా ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. ఇంటర్నెట్‌లో కనిపించే జీవితాలతో తమ జీవితాలను పోల్చుకోవడం వల్ల దంపతులపై అదనపు ఒత్తిడి పెరుగుతోందని చెప్పారు. సోషల్ మీడియాలో ప్రేమ, పెళ్లి, ఆనందానికి సంబంధించిన ఎన్నో పోస్టులు కనిపిస్తుంటాయి. అయితే అవి ప్రతి ఒక్కరి నిజ జీవితాన్ని ప్రతిబింబించకపోవచ్చు. అందంగా కనిపించే ఫొటోలు, సంతోషకరమైన క్షణాలనే ఎక్కువగా పంచుకోవడంతో.. సంబంధాల్లో సమస్యలు, ఇబ్బందులు బయటకు కనిపించవు. దీంతో ఇతరుల జీవితాలతో తమ జీవితాలను పోల్చుకోవడం మొదలవుతుందని కాజల్ పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రముఖుల వ్యక్తిగత జీవితాలపై సోషల్ మీడియా నిఘా ఎక్కువగా ఉంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రతి విషయంపైనా వచ్చే కామెంట్లు, విమర్శలు సంబంధాలపై ఒత్తిడిని పెంచుతున్నాయని తెలిపారు. ఈ ప్రభావం మహిళలపై మరింత ఎక్కువగా ఉంటుందని గతంలోనూ కాజల్ మాట్లాడారు. ప్రేమ సంబంధాల గురించి కాజల్ గతంలోనూ తన అభిప్రాయాలను వెల్లడించారు. జీవితంలో సంతోషం పూర్తిగా ప్రేమ లేదా వివాహ బంధంపైనే ఆధారపడకూడదని ఆమె చెప్పారు. భర్త గౌతమ్ కిచ్లుతో తన అనుబంధం గురించి కూడా పలు సందర్భాల్లో మాట్లాడారు. ప్రస్తుతం విడాకులపై ఆమె చేసిన వ్యాఖ్యలు మరోసారి చర్చకు దారితీశాయి. మారుతున్న అంచనాలు, సోషల్ మీడియా ప్రభావం, ఆధునిక జీవనశైలి.. ఇవన్నీ నేటి సంబంధాలపై ప్రభావం చూపుతున్నాయని కాజల్ వ్యాఖ్యలు సూచిస్తున్నాయి.

# శర్వానంద్ కోసం శ్రీను వైట్ల కొత్త ఫార్ములా?

టాలీవుడ్‌లో తనదైన కామెడీ మార్క్‌ను క్రియేట్ చేసుకున్న డైరెక్టర్ శ్రీను వైట్ల కొంతకాలంగా సరైన సక్సెస్ కోసం ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో శర్వానంద్‌తో చేస్తున్న జార్జ్ క్రిష్‌పై ప్రత్యేకమైన అంచనాలు నెలకొన్నాయి. అయితే ఈసారి శ్రీను వైట్ల తన రెగ్యులర్ ఫార్ములాకే మరో కొత్త టచ్ ఇచ్చినట్లు ఇండస్ట్రీ వర్గాల్లో డిస్కషన్ జరుగుతోంది. ఇప్పటివరకు ఎక్కువగా యాక్షన్, కామెడీ, హీరోయిజం చుట్టూ తన కథలను నడిపించిన ఆయన.. ఈసారి హీరో క్యారెక్టరైజేషన్‌కు సైంటిఫిక్ బ్యాక్‌డ్రాప్‌ను జోడించినట్లు తెలుస్తోంది. జార్జ్ క్రిష్‌లో శర్వానంద్ జూనియర్ సైంటిస్ట్‌గా కనిపించబోతున్నాడట. ఈ క్యారెక్టర్ ను కేవలం హీరో చేసే జాబ్ లాగా కాకుండా, కథలోని కీలకమైన అంశంగా డిజైన్ చేసినట్లు సమాచారం. మామూలుగా కమర్షియల్ సినిమాల్లో హీరోలను పోలీస్, గ్యాంగ్‌స్టర్, బిజినెస్‌మ్యాన్, మాస్ లీడర్ వంటి పాత్రల్లో చూడటానికి అలవాటు పడిన ఆడియన్స్ కు జూనియర్ సైంటిస్ట్ క్యారెక్టర్ కొత్త అనుభూతినిచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా సైంటిఫిక్ నేపథ్యాన్ని శ్రీను వైట్ల తనదైన ఎంటర్టైనింగ్ ట్రీట్‌మెంట్‌తో మిక్స్ చేస్తే ఎలాంటి సిట్యువేషనల్ కామెడీ పుడుతుందనేది ఆసక్తికరంగా మారిందిఅంతేకాదు.. ఈ సినిమా కోసం శర్వానంద్ సరికొత్త మేకోవర్‌లో కనిపించబోతున్నాడని ఇప్పటికే పలు వార్తలొచ్చాయి. సాధారణంగా మేకోవర్ అనగానే హీరో లుక్ మార్పుగా మాత్రమే చూస్తాం. కానీ జార్జ్ క్రిష్‌లో శర్వానంద్ లుక్ కూడా ఆయన పోషిస్తున్న జూనియర్ సైంటిస్ట్ పాత్ర స్వభావానికి తగ్గట్టుగానే ఉండబోతుందనే టాక్ వినిపిస్తోంది. అంటే ఈ సినిమాలో హీరో ఇమేజ్ కంటే క్యారెక్టరైజేషన్‌కు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చినట్లు కనిపిస్తోంది. ఇక శ్రీను వైట్ల గత సినిమాల్లో కనిపించిన కామెడీ ఎపిసోడ్స్, హీరో క్యారెక్టరైజేషన్, ఎంటర్టైనింగ్ ట్రాక్‌లకు ఈసారి సైంటిఫిక్ సెటప్‌ను జోడించడం ఆసక్తిని పెంచుతోంది. తన ఫార్ములాను పూర్తిగా మార్చకుండా.. అదే ఫార్ములాకు కొత్త ప్రపంచాన్ని సృష్టించారా అనే డిస్కషన్ కూడా మొదలైంది. శర్వానంద్ కోసం శ్రీను వైట్ల ఇలా ఒక కొత్త ఫార్ములాను సిద్ధం చేశారా అనేది సినిమా రిలీజయ్యే వరకు ఆసక్తికరంగా మారనుంది. ప్రస్తుతం ఈ సినిమా తర్వాతి షెడ్యూల్ షూటింగ్‌కు సిద్ధమవుతోంది. ఈ షెడ్యూల్‌లో శర్వానంద్, భాగ్యశ్రీ బోర్సేపై కీలకమైన లవ్ సీన్స్‌ను తెరకెక్కించనున్నట్లు తెలుస్తోంది. అనిల్ సుంకర నిర్మిస్తున్న ఈ సినిమాను సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్రయత్నిస్తున్నారు.



# బాలీవుడ్ నటుడికి అంతర్జాతీయ గుర్తింపు.. అనుపమ్ ఖేర్‌ను సత్కరించిన అమెరికా

ప్రముఖ బాలీవుడ్ నటుడు, విలక్షణ కళాకారుడు అనుపమ్ ఖేర్‌కు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం లభించింది. నాలుగు దశాబ్దాలకు పైగా సినీ రంగంలో ఆయన చేసిన సేవలను, ఆయన రంగస్థల ప్రదర్శనలను గుర్తిస్తూ అమెరికాలోని ఒహాయో రాష్ట్రం ఆయనను ప్రత్యేక ప్రకటనతో సత్కరించింది. కొలంబస్‌లో ప్రదర్శించిన 'జానే పెహచానే అంజానే' అనే నాటక ప్రదర్శనను కూడా ఈ సందర్భంగా ప్రశంసించారు.

ఈ సంతోషకరమైన విషయాన్ని అనుపమ్ ఖేర్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా అభిమానులతో పంచుకున్నారు. ఒహాయో రాష్ట్రం నుంచి అందుకున్న గౌరవ పత్రాన్ని చేతిలో పట్టుకున్న ఫొటోను షేర్ చేస్తూ తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. "ఈ ప్రత్యేక గౌరవాన్ని ఎంతో వినమ్రతతో, గర్వంతో స్వీకరిస్తున్నాను. నాలుగు దశాబ్దాల నా సినీ ప్రయాణాన్ని, మా 'జానే పెహచానే అంజానే' నాటకాన్ని గుర్తించినందుకు ఒహాయో గవర్నర్ మైక్




డీవైన్, లెఫ్టినెంట్ గవర్నర్ జిమ్ ట్రెస్సెల్‌కు నా హృదయపూర్వక కృతజ్ఞతలు" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. ఈ గౌరవం కేవలం తనకు మాత్రమే కాదని, తనకు గుర్తింపునిచ్చిన భారత సినీ పరిశ్రమకు, తన నాటక బృందానికి కూడా చెందుతుందని అనుపమ్ ఖేర్ తెలిపారు. "స్వదేశానికి ఇంత దూరంలో ఇలాంటి గుర్తింపు లభించడం మనసును కదిలించింది. ఈ మరువలేని గౌరవానికి ఒహాయోకు ధన్యవాదాలు. జై హింద్" అంటూ తన పోస్టులో రాసుకొచ్చారు.

1984లో మహేశ్ భట్ దర్శకత్వంలో వచ్చిన 'సారాంశ్' చిత్రంతో అనుపమ్ ఖేర్ తన నట ప్రస్థానాన్ని ప్రారంభించారు. అప్పటి నుంచి 'కర్మ', 'తేజాబ్', 'రామ్ లఖన్', 'దిల్', 'హమ్ ఆప్కే హై కౌన్', 'దిల్వాలే దుల్హనియా లేజాయేంగే', 'కుచ్ కుచ్ హోతా హై', 'స్పెషల్ 26', 'ఊంచాయ్' వంటి ఎన్నో విజయవంతమైన చిత్రాలలో విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకులను మెప్పించారు.

ఆయన చివరిగా 'తన్వి ది గ్రేట్' అనే చిత్రంలో కనిపించారు. ఆటిజంతో బాధపడుతున్న ఒక యువతి తన తండ్రి కలను నెరవేర్చడానికి సైన్యంలో చేరాలనుకునే స్ఫూర్తిదాయక కథతో ఈ సినిమా తెరకెక్కింది.

"MANA VISHWAM" vide PRGI Registration No. "TGTEL/26/A4450" Printed by SRI VENKATESWARA PRINTING SOLUTIONS, Published by Nameendla Pramod on behalf of Nameendla Pramod, printed at 11-1/B/42, BPM GREEN LANDS COLONY, PRVATHAPUR, MEDIPALLY MANDAL AND DIVISION, GHMC, MEDCHAL MALKAJGIRI, TELANGANA - 500098 and published at H No 2-96, Geesugonda, Gorrekunta editor Nameendla Pramod. Gmail- manavishwamtelugudaily@gmail.com, Cell- 6305638569